ప్రజాశక్తి

గురువారం 16 నవంబర్ 2023 | 8 పేజీలు

ఎన్‌టిఆర్

కృష్ణా

సభా వేదికపై నాయకుల అభివాదం, హాజరైన ప్రజలు

బిఆర్‌టిఎస్ రోడ్డులో భారీ ప్రదర్శన

మహా ప్రవాహం

'ప్రజా రక్షణ భేరి'తో ఎరుపెక్కిన నగరం

ప్రజా వ్యతిరేక విధానాలపై గర్జించిన సిపిఎం శ్రేణులు

రెడ్ డ్రెస్ వాలంటీర్ల భారీ కవాతు

వినూత్న కళా ప్రదర్శనలు

పాలకుల గుండెల్లో రైళ్లు

ఎర్రసైన్యం కదం తొక్కింది. నదీ ప్రవాహంలా ముందుకు సాగింది. సముద్రపు కెరటంలా ఎగసింది. పాలకుల విధానాలపై సునామిలా విరుచుకుపడింది. సింహంలా గర్జించింది. ప్రజా వ్యతిరేక విధానాలను మార్చుకోకపోతే పతనం తప్పదని హెచ్చరించింది. ప్రత్యామ్నాయ విధానాలతో ముందుకు వచ్చింది. విజయవాడ నగరంలో బుధవారం సిపిఎం చేపట్టిన ప్రజా రక్షణ భేరి మహా ప్రదర్శన, బహిరంగ సభలు....పాలకుల ప్రైవేటీకరణ, రాష్ట్రానికి మోడీ చేసిన ద్రోహీకరణ ! (ద్రోహం), మోసీకరణ ! (మోసం) లను ఎత్తి చూపాయి. సింగ్‌నగర్లోని ఎంబి స్టేడియంలో బహిరంగ సభ సందర్భంగా రెడ్ డ్రెస్ వాలంటీర్లు నిర్వహించిన కవాతు పాలకుల గుండెల్లో రైళ్లు పరిగెత్తించింది. సిపిఎం శ్రేణులు, అభిమానులు, సానుభూతిపరులు, అభ్యదయవాదులు వేలాదిగా తరలివచ్చి బిఆర్‌టిఎస్ రోడ్డు ఫుడ్ జంక్షన్ నుండి స్టేడియం వరకు నిర్వహించిన మహా ప్రదర్శన నగర ప్రజలను ఆశ్చర్యచకితులను చేసింది. మళ్లీ పూర్వపు రోజులను గుర్తుచేసింది. మూడు కిలో మీటర్ల మేర సాగిన భారీ ప్రదర్శన ఎంతో క్రమశిక్షణగా సాగడం నగరవాసులను విశేషంగా ఆకట్టుకుంది. వినూత్న కళా రూపాల ప్రదర్శనలు చూపురులను కట్టపడేశాయి. రెడ్ శాల్యూట్ నినాదంతో ముందుకు సాగిన ఈ 'ప్రవాహం'లో నేతలు...ప్రజలకు అభివాదం చేస్తూ 'మీకు తోడు మేమున్నాము' అంటూ భరోసా కల్పించారు.

(పూర్తి వివరాలు, దృశ్యాలు మెయిన్- టాబ్లాయిడ్ లోపలి పేజీల్లో)

కవాతులో మహిళా వాలంటీర్లు

ప్రదర్శనలో పూల వర్షం

ప్రదర్శనలో పాల్గొన్న జనవాహిని

ఎసిబి దాడులు

పట్టుబడ్డ ఫారెస్ట్ బీట్ ఆఫీసర్

డబ్బులు తీసుకుంటుండగా పట్టుబడిన అధికారి

ప్రజాశక్తి-మైలవరం: మైలవరంలో ఎసిబి అధికారులు బుధవారం దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో ఓ వ్యక్తి నుండి రూ.25 వేలు తీసుకుంటున్న మైలవరం ఫారెస్ట్ ఆఫీస్‌లో బీట్ ఆఫీసర్‌గా పని చేస్తున్న ఎ.రామకృష్ణను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. దీనికి సంబంధించి ఎసిబి అడిషనల్ ఎస్‌పి బి.స్నేహిత తెలిపిన వివరాల ప్రకారం... రెడ్డిగూడెం మండలం ఓబులాపురం గ్రామానికి చెందిన గండిపూడి రాంబాబు గేదెలు మేపుకుంటూ రైతుల పంట పొలాల్లో ఉన్న వేప చెట్లను కొని అమ్ముకుంటూ ఉంటాడు. ఈ నేపథ్యంలో మైలవరం ఫారెస్ట్ సెక్షన్ బీట్ ఆఫీసర్ రామకృష్ణ గత మూడు నెలల నుండి రాంబాబును డబ్బులు డిమాండ్ చేయడంతో పాటు అసభ్య పదజాలంతో దూషిస్తున్నాడు. దీంతో బాధితుడు రాంబాబు ఎసిబి అధికారులను ఆశ్రయించాడు. తహశీల్దార్ కార్యాలయం సమీపంలో రామకృష్ణ అద్దెకు ఉంటున్న ఇంటి వద్ద రూ.25 వేలు తీసుకుంటుండగా ఎసిబి అధికారులు పట్టుకున్నారు. రామకృష్ణ ఇంటిని సోదాలు చేయగా రూ.1.19 లక్షలు దొరికినట్లు స్నేహిత తెలిపారు. రామకృష్ణతో పాటు అతని వద్ద స్వీపర్‌గా పని చేస్తున్న సురేష్‌కుమార్‌ను ఎసిబి అధికారులు అదుపులోకి విచారిస్తున్నారు. ఈ దాడుల్లో డిఎస్‌పి శ్రీనివాస్, సిఐలు శివకుమార్, శ్రీనివాస్ సిబ్బంది పాల్గొన్నారు.

గిరిజన వీరుల పోరాటం మరువలేనిది

కృష్ణా, ఎన్‌టిఆర్ జిల్లాల కలెక్టర్లు రాజాబాబు, డిల్లీరావు

ప్రజాశక్తి-విజయవాడ, మచిలీపట్నం రూరల్

దేశ స్వాతంత్ర్య సమరంలో గిరిజన వీరులు అందించిన సేవలు మరువలేనివని కృష్ణా, ఎన్‌టిఆర్ జిల్లాల కలెక్టర్లు పి.రాజాబాబు, ఎస్.డిల్లీరావు అన్నారు. బుధవారం జన జాతీయ గౌరవ దివస్ వేడుకలను ఆయా జిల్లాల కలెక్టరేట్‌లలో నిర్వహించారు. ముందుగా గిరిజన స్వాతంత్ర్య సమరయోధులు అల్లూరి సీతారామరాజు, గాము గంటం దొర, బోనంగి పండు పడాల్, కుడుముల పడ్డ బయ్యన్న, గాము మల్లుదొర, హనుమంతప్ప, కారం తమ్మన్న దొర, సంకోజి ముక్కుడు, గోకిరి ఎర్రేసు, మర్రి కమ్మయ్య తదితరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళు లర్పించారు. విజయవాడ కలెక్టరేట్‌లోని పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ డిల్లీరావు మాట్లాడుతూ గిరిజనుల సమగ్రాభివృద్ధికి ప్రతిఒక్కరూ భాగస్వామ్యం కావాల్సిన అవసరం ఉందన్నారు.

జన జాతీయ గౌరవ దివస్ వేడుకల్లో కృష్ణా, ఎన్‌టిఆర్ జిల్లాల కలెక్టర్లు రాజాబాబు, డిల్లీరావు

జాతి గౌరవాన్ని, దేశ సంస్కృతీ సంప్రదాయాల పరిరక్షణలో కీలకపాత్ర పోషిస్తున్న గిరిజన జాతుల ఆత్మ గౌరవాన్ని పరిరక్షణలో భాగంగా గిరిజన పోరాట యోధుడు బిర్సా ముండా స్ఫూర్తిని దేశ ప్రజలు స్మరించుకునే లక్ష్యంతో ఆయన జయంతి రోజైన నవంబర్ 15న జన జాతీయ గౌరవ దివస్ పేరుతో ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించుకోవడం జరుగుతోందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గిరిజన సంక్షేమ, సాధికారత అధికారి ఎం రుక్మాంగదయ్య, గురుకులాల జిల్లా కన్వీనింగ్ అధికారి జి జాన్సన్ దేవరాజ్, డిఎంహెచ్ఒ డాక్టర్ ఎం సుహాసిని, యానాది సంఘం రాష్ట్ర అధ్యక్షులు రామచంద్రయ్య, ట్రైకార్ డైరెక్టర్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మచిలీపట్నం కలెక్టరేట్లోని స్పందన సమావేశం మందిరంలో జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ పి.రాజాబాబు మాట్లాడుతూ భారతదేశ స్వాతంత్ర్య పోరాటంలో గిరిజనుల త్యాగాలను రాబోయే తరాలకు (మిగతా 6లో)

వ్యాసరచన పోటీల్లో కాకతీయ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - నందిగామ : 'ప్రపంచ మధుమేహ దినోత్సవం' సందర్భంగా విజిఆర్ డయాబెటిస్ స్పెషాలిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో 'మధుమేహ వ్యాధి లక్షణాలు – నియంత్రణ' అనే అంశంపై నిర్వహించిన వ్యాసరచన పోటీలో నందిగామ కాకతీయ బ్రాండ్ విద్యాసంస్థలకు చెందిన 14 మంది విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. వివిధ కేటగిరిలలో బహుమతులు సాధించారు. విజయవాడ సిద్ధార్థ ఆడిటోరియంలో ఏర్పాటుచేసిన అవగాహన సదస్సులో బహుమతుల ప్రధానోత్సవం జరిగింది. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎన్ జయ సూర్య, సినీ హాస్యనటుడు కే బ్రహ్మానందం, మాజీ పార్లమెంటు సభ్యులు యార్లగడ్డ లక్ష్మి ప్రసాద్, విజిఆర్ హాస్పిటల్ డాక్టర్ కే వేణుగోపాల్ రెడ్డి, డాక్టర్ ఇండ్ల రామసుబ్బారెడ్డి, మొదలగువారు పాల్గొని విద్యార్థులకు అనేక రకాల సూచనలు, సలహాలు హాస్య, చలోక్తులతో సభా కార్యక్రమం నిర్వహించారు. జిల్లాలోని పలు విద్యాసంస్థల నుండి వచ్చిన విద్యార్థిని విద్యార్థులకు బహుమతులు

గెలుపొందిన విద్యార్థులు

ప్రదానోత్సవం చేశారు. ఇందులో కాకతీయ అపోలో విద్యాసంస్థల నుండి బహుమతులు సాధించిన విద్యార్థులు పదో తరగతి నుండి వై హరిత, కే స్వప్నిక, ఎస్ శరణ్యలక్ష్మి, షేక్ నమ్మతే ఉజుమా 9, 8, 7 తరగతి విద్యార్థులు బహుమతులు సాధించారు. కాకతీయ అపోలో విద్యాసంస్థల చైర్మన్ శ్రీ కాపారవీంద్రనాథ్, హెడ్మాస్టర్ భారతి, ప్రిన్సిపల్ ఎం.కవిత, ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు అభినందించారు.

వంతెన నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి - మైలవరం : మండలం లోని పొందు గుల గ్రామంలో బైపాస్ రోడ్డులో ఎంఎఫ్ఎస్ ద్వారా మంజూరైన రూ.20 లక్షలతో వంతెన నిర్మాణానికి బుధవారం ఎంపిపి లక్ష్మి ప్రసన్న రాణి, సర్పంచు గగులోతు కోటమ్మ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్థానిక శాసనసభ్యులు వసంత కష్ణ ప్రసాద్ సహకారంతో గ్రామంలో పలు అభివద్ధి పనులు చేస్తున్నామన్నారు. పార్టీలకతీతంగా గ్రామాభివద్ధి తమ లక్ష్యం అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి మందా రామారావు, గ్రామ మాజీ సర్పంచులు బొడ్డపాటి రాజా, డొంకెను చలపతిరావు, ఇస్లావతు స్వామి, గుగులోతు రాంబాబు, కష్ణ, మూడు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

శంకుస్థాపన చేస్తున్న ఎంపిపి, సర్పంచ్

ఆన్‌లైన్‌లో పిఎం కిసాన్ సమ్మాన్ నిధి వీక్షణ

జగ్గయ్య పేట: మండలం లోని గరికపాడు డాక్టర్. కే.ఎల్. రావు కృషి విజ్ఞాన్ కేంద్రం ఆధ్వర్యంలో ఆన్లైన్లో జార్ఖండ్‌లో జరగనున్న ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి కార్యక్రమం వివిధ గ్రామాల నుంచి రైతులు ఏపీసిఎన్ఎఫ్ సిబ్బంది పాల్గొని వీక్షించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన మంత్రి మోడీ 15వ విడత డబ్బులు విడుదల చేశారు. దాంతో పాటు భారత సంకల్పయాత్రను ప్రారంభించారు. వ్యవసాయంలో ఆధునిక పద్ధతులను రైతులకు తెలియజేయడం కోసం భారత సంకల్పయాత్రను ప్రారంభించినట్లు తెలిపారు.

రోడ్డు ఏర్పాటు పట్ల హర్షం

జగ్గయ్యపేట: పట్టణ పురపాలక సంఘ పరిధిలోని పదో వార్డు రైతు బజార్ పక్కనే ఉన్న డ్వాక్రా బజార్ కాంప్లెక్స్ నుంచి గాలి మిషన్ రోడ్డు వరకు నూతనంగా 6.35 లక్షల రూపాయలతో నిర్మించిన సిమెంట్ రోడ్డును బుధవారం అ వార్డు కౌన్సిలర్, నియోజకవర్గం తెలుగు మహిళా అధ్యక్షురాలు కన్నెబోయిన రామలక్ష్మి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆ ప్రాంత వాసులు ముఖ్యంగా మహిళలు ఎన్నో దశాబ్దాలుగా తమ రోడ్డు నిర్మాణం చేపట్టాలని కోరుతూ వచ్చినా నిర్మాణం జరగలేదని కౌన్సిలర్‌గా రామలక్ష్మి ఎన్నికైన తర్వాతే రోడ్డుకు మోక్షం వచ్చిందని సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రామలక్ష్మీ మాట్లాడుతూ మున్సిపల్ ఎన్నికల సమయంలో ఎన్నికల ప్రచారానికి విచ్చేసిన సందర్భంగా మాజీ మంత్రి, విజయవాడ పార్లమెంట్ టిడిపి అధ్యక్షుడు నెట్టెం రఘురాం, మాజీ ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య, నియోజకవర్గ టిడిపి సమన్వయ కమిటీ సభ్యులు నెట్టెం శివరాం, శ్రీరాం చినబాబుల దష్టికి ఆ వీధి వాసులు తీసుకెళ్లగా ఎన్నికలవగానే రోడ్డు నిర్మాణం చేయిస్తామని ఇచ్చిన హామీ మేరకు రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదించినట్లు తెలిపారు. మున్సిపల్ పాలక వర్గం ఈ రోడ్డు నిర్మాణానికి వార్డుతో సంబంధంలేని ఒక వ్యక్తి కారణ మని చెప్పుకోవటం దిగజారుడు రాజకీయాలకు నిదర్శనమన్నారు.

రోడ్డును పరిశీలిస్తున్న దృశ్యం

దుర్గగుడి చైర్మన్ కర్నాటికి వైవి సుబ్బారెడ్డి పరామర్శ

ప్రజాశక్తి - వన్‌టౌన్ : దుర్గగుడి చైర్మన్ కర్నాటి రాంబాబు తండ్రి కర్నాటి బాబూరావు (72) గుండె పోటుకు గురై మృతిచెందిన విషయం తెలిసిందే. ఈ నేపధ్యంలో బుధవారం టిటిడి మాజీ చైర్మన్ వై.వి. సుబ్బారెడ్డి చిట్టినగర్ కెఎల్ రావు నగర్‌లోని కర్నాటి రాంబాబును కలిసి పరామర్శించారు. రాంబాబు తండ్రి మృతి విషయమై ఆరాతీశారు. కుటుంబ సభ్యులకు మనోధైర్యం కల్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

కర్నాటి రాంబాబును పరామర్శిస్తున్న వైసి సుబ్బారెడ్డి

రోడ్డు పరిశీలన

ప్రజాశక్తి - జగ్గయ్యపేట: పట్టణంలోని 10వ వార్డులో రూ.6.5 లక్షలతో నిర్మించిన రోడ్డును బుధవారం మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్రరావు పరిశీలించారు. ఈ సందర్భంగా చైర్మన్ రాఘవేంద్ర మాట్లాడుతూ కొంత కాలంగా ఇక్కడ రోడ్డు సదుపాయం సరిగ్గా లేకపోవడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని వార్డు నాయకులు ఆవాల భవాని ప్రసాద్ తెలియజేయడంతో మున్సిపల్ సాధారణ నిధుల సహాయంతో రోడ్డు నిర్మించినట్లు ఈ వార్డులోనే, రైతు బజార్ పక్కనే మెయిన్ డ్రైన్ రేపటి నుంచి నిర్మాణ పనులు ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ప్రజలు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర రావు, కౌన్సిలర్ వట్టెం

రోడ్డును పరిశీలిస్తున్న రాఘవేంద్రరావు తదితరులు

మనోహర్, వైసిపి పట్టణ యువజన విభాగం అధ్యక్షులు ఆవాల భవాని ప్రసాద్, మున్సిపల్ డిఇ శివ కోటేశ్వరరావు, ఏ ఈ హనుమంతరావు, సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జగనన్న ప్రగతి పథం ర్యాలీ పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి -జగ్గయ్యపేట : ఈ నెల 18న రాష్ట్ర ఐటి విభాగం ఆధ్వర్యంలో విజయవాడలో జరగబోయే జగనన్న ప్రగతి పదం ర్యాలీని జయప్రదం చేయాలని రాష్ట్ర ప్రభుత్వవిప్ శాసనసభ్యులు ఉదయభాను అన్నారు. బుధవారం విజయవాడలోని ప్రభుత్వవిప్ సామినేని ఉదయభాను కార్యాలయంలో రాష్ట్ర ఐటి విభాగం ఆధ్వర్యంలో జగనన్న ప్రగతి పథం ర్యాలీకి సంబంధించిన వాల్ పోస్టర్‌ను రాష్ట్ర ప్రభుత్వవిప్, జగ్గయ్యపేట శాసనసభ్యులు సామినేని ఉదయభాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఉదయభాను మాట్లాడుతూ జగన్ పాలనలో జరుగుతున్న సంక్షేమం అభివద్ధిని వివరించడమే లక్ష్యంగా ఈ ర్యాలీ నిర్వహించడం

పోస్టర్ ఆవిష్కరిస్తున్న సామినేని ఉదయభాను

జరుగుతుందని తెలిపారు.

న్యాయవాదిపై దాడికి ఖండన

ప్రజాశక్తి - తిరువూరు : అనంతపురం, నంద్యాలకు చెందిన దళిత న్యాయవాది మందా విజయకుమార్‌పై అమానుషంగా చేసిన దాడిని ఖండిస్తూ తిరువూరు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు బుధవారం కోర్టు విధులు బహిష్కరించి కోర్టు బయట నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు సంకురాత్రి జనార్ధనరావు, ఉపాధ్యక్షులు ఎ.జీవన్ బాబు, ప్రధాన కార్యదర్శి అంజన్ రెడ్డి,

నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

న్యాయవాదులు రాజవరపు శ్రీనివాసరావు,పాల్గొన్నారు.

భావయుక్త పద్యంతోనే ప్రేక్షకులకు అనుభూతి

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : పౌరాణిక పద్య నాటకంలో నటుడు పాత్రకు తగిన హావభావాలతో పాటు పద్యం కూడా భావరస భరితంగా ఆలపించగలిగినప్పుడే ప్రేక్షకులు రసానుభూతిని పొందగలరని, పద్య నాటకం తెలుగు వారికే సొంతమైనదని ప్రసిద్ధ రంగస్థల నటులు, కవి, గాయకులు డాక్టర్ అక్కిరాజు సుందర రామకృష్ణ అన్నారు. వెలిదండ్ల హనుమంతరాయ గ్రంథాలయంలో ఏడు రోజులపాటు నిర్వహించే జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో రెండో రోజు బుధవారం ఉదయం తెలుగు పద్య నాటక వైభవంపై జరిగిన అంశంపై ఆయన ప్రసంగించారు. ఒక్కొక్క కళా ప్రక్రియలో ఒక్కొక్కలా పద్యాన్ని చదువుతారని అయితే పౌరాణిక పద్య నాటకంలో వేషానికి ప్రాధాన్యతనిస్తూ హావభావాలతో పాటు పద్యంలోని సాహిత్య భావంతో తాను లీనమై ప్రేక్షకులను లీనం చేయగలిగినప్పుడే ప్రదర్శనకు పరిపూర్ణత్వం లభిస్తుందని అన్నారు. నటుడు, రచయిత, దర్శకుడు డాక్టర్ పి.వి.ఎన్.కష్ణ మాట్లాడుతూ పద్య నాటక వైభవానికి ఒకప్పటి ఆదరణ లేదని, అత్యాధునికమైన సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన నేటి రోజులలో ప్రేక్షకుడి అభిరుచి మేరకు వారిని పద్య నాటక

మాట్లాడుతున్న రామకృష్ణ

ప్రదర్శనకు రాబట్టుకునే స్థాయికి నటుడు, సంబంధిత పద్య నాటక సంస్థలు ఆ సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించాల్సిన అవసరం ఎంతో ఉందని, ప్రదర్శించే ప్రదర్శనలలో ఆ విధమైన మార్పు రావాలని అన్నారు. కొత్త పద్య నాటకాలను పాఠ్యాంశాలలో చేర్చి విద్యార్థుల చేత పాఠశాల, కళాశాలలో ప్రదర్శింప చేయాలని కోరారు. హిందీ భాషావేత్త, రచయిత, అనువాదకుడు డాక్టర్ వెన్నా వల్లభరావు మాట్లాడుతూ పండిత పామరులను అలరిస్తున్న దశాబ్దాల కళారూపం పద్య నాటకం అని అన్నారు.

విద్యార్థులకు స్టీల్ ప్లేట్లు పంపిణీ చేస్తున్న జనసేన నాయకులు మహేష్, విజయలక్ష్మి

జిఎన్ఆర్ పాఠశాల విద్యార్థులకు స్టీల్‌ప్లేట్లు పంపిణీ

ప్రజాశక్తి - భవానీపురం : స్థానిక 44వ డివిజన్ లేబర్ కాలనీలో గల జిఎన్ఆర్ మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్ 100 మంది విద్యార్థులకు స్టీల్ ప్లేట్లను జనసేన పార్టీ 44వ డివిజన్ అధ్యక్షురాలు, కష్ణ పెన్నా మహిళ కమిటీ సమన్వయకర్త మల్లెపు విజయలక్ష్మి సురేష్‌లు జనసేన పశ్చిమ నియోజకవర్గ ఇన్చార్జ్, నగర అధ్యక్షులు పోతిన వెంకట మహేష్ చేతుల మీదుగా బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పోతిన మహేష్ మాట్లాడుతూ జనసేనపార్టీ తరపున సామాజిక సేవాదక్పథంతో విజయలక్ష్మి అనేక సేవాకార్యక్రమాలు చేస్తున్నారని అన్నారు. మల్లెపు విజయలక్ష్మి మాట్లాడుతూ ప్లేట్ల పంపిణీ మంచి పరిణామమన్నారు. 44వ డివిజన్ ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నట్లు ఆమె వివరించారు.

పిచ్చి మొక్కలు తొలగింపు

ప్రజాశక్తి - జగ్గయ్యపేట: పట్టణంలోని 3, 6వ వార్డుల ప్రజల కోరిక మేరకు పాములు ఇళ్లలోకి వస్తుండగా మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర ఆదేశాలతో జేసీబీతో అర్‌టిసి డిపో గ్రౌండ్‌లో అడవిలా దట్టంగా పెరిగిన ముళ్ల కంపలు, పిచ్చి మొక్కలను వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకరరావు అధ్వర్యంలో చేయించారు.

వ్యక్తి మృతిపై ఫిర్యాదు

ప్రజాశక్తి - గంపలగూడెం: అక్రమ మట్టి తవ్వకాల గోతుల వల్ల తన తండ్రి మృతిచెందాడంటూ కాలసాని నాగాంజనేయులు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మంగళవారం సాయంత్రం మండలం దిందిరాలపాడు శివారు మల్లేంపాడు గ్రామానికి చెందిన కాలసాని శ్రీనివాసరావు (57) అక్రమ మట్టి తవ్వకాలు జరిపిన గోతుల్లో కూరుకుపోయి మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ మేరకు విషయమై మతుని కుమారుడు నాగాంజనేయులు స్థానిక స్టేషన్లో ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ పి.రాంబాబు తెలిపారు. దీనిపై శవ పంచనామా నిర్వహించి, కేసు దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు. మతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తిరువూరు ప్రభుత్వా సుపత్రికి పంపినట్లు ఎస్సై వివరించారు.

రోడ్డు ప్రమాదంలో మాజీ లెక్చరర్ మృతి

ప్రజాశక్తి - నందిగామ : రోడ్డు ప్రమాదంలో కె.వి.ఆర్ కాలేజ్ రిటైర్డ్ లెక్చరర్, న్యాయవాది సూర్యదేవర సుబ్బారావు (68) మృతిచెందారు. సుబ్బారావు బుధవారం ఉదయం వాకింగ్ చేసి వస్తుం డగా బుల్లెట్ బైక్ ఢీ కొట్ట డంతో గాయ పడిన సుబ్బారావును నంది గామ ప్రభుత్వ ఆస్ప త్రికి తరలిం చారు. ఎం ఎల్ఎ జగన్ మోహన్‌రావు సుబ్బారావుకు ప్రాథమిక చికిత్స అందించి విజయవాడ తరలిస్తుండగా మృతి చెందారు. సుబ్బారావుకు భార్య, ఇద్దరు కుమార్తె లున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సుబ్బారావుకు వైద్యం చేస్తున్న ఎంఎల్ఎ

చల్లపల్లిలో...

ప్రజారక్షణభేరి సభకు తరలిన నాయకులు

ప్రజాశక్తి-చల్లపల్లి : విజయవాడలో జరిగిన ప్రజారక్షణ భేరి బహిరంగ సభకు చల్లపల్లి మండలం నుండి భారీగా సిపిఎం పార్టీ బందంతరలి వెళ్లారు. పార్టీ సభ్యులు కార్యకర్తలు అంగన్వాడి, పంచాయతీ కార్మికులు ఆటో వర్కర్స్, కళాకారులు సభకు తరలి వెళ్లారు. గత వారం రోజులుగా సిపిఎం సిఐటియూ నాయకులు, కార్యకర్తలు గ్రామాలలో పర్యటించి సమావేశాలు, కరపత్రాల పంపిణీ చేశారు, బైక్ ర్యాలీ ఆటో జాత నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. చల్లపల్లి మండలం సిఐటియు మండల అధ్యక్ష కార్యదర్శులు సిహెచ్ గంగాభవాని, మహమ్మద్ కరిముల్లా, మండల వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షులు బండారు కోటేశ్వరరావు, కమిటీ సభ్యులు తరలివెళ్లారు. విజయవాడ సభకు తరలివచ్చిన కార్యకర్తలకు నాయకులకు మండల కమ్యూనిస్టు పార్టీ తరఫున కార్యదర్శి యద్దనపూడి మధు అభినందనలు తెలిపారు. **ప్రజాశక్తి ఘంటసాల :** ఘంటసాల నుంచి ప్రజారక్షణభేరి కి సిపిఎం సీనియర్ నాయకులు వాకా రామచంద్రరావు ఆధ్వర్యంలో నాయకులు కార్యకర్తలు బుధవారం తరలివెళ్లారు. ఈ కార్యక్రమంలో మహిళా కార్యకర్తలు నాయకులు పాల్గొన్నారు.

ఘంటసాలలో..

గెలుపే లక్ష్యంగా పనిచేయాలి : రావి

ప్రజాశక్తి-గుడివాడ : ప్రతి నాయకుడు, కార్యకర్త రాబోయే ఎన్నికలలో గెలుపే లక్ష్యంగా పనిచేయాలని మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు పిలుపు నిచ్చారు. రాష్ట్ర పార్టీ ఆదేశాల మేరకు బాబు షూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమాన్ని బుధవారం 8వ వార్డులోని 74,75 బూత్‌లలో నిర్వహించారు. ఈ సందర్భంగా రావి మాట్లాడుతూ టిడిపి అధికారంలోకి వస్తే రాష్ట్రానికి ఏ విధంగా ప్రజల భవిష్యత్తుకు భరోసా ఇస్తుందో తెలియజేయలన్నారు. ఈకార్యక్రమంలో పట్టణాధ్యక్షుడు దింట్యాల రాంబాబు, క్లస్టర్ ఇన్‌చార్జి ముళ్ళపూడి రమేష్‌చౌదరి, బూత్ ఇంచార్జ్‌లు అర్వేపల్లి పాండు, శేషుబాబు, యర్రంశెట్టి చంద్రమౌళి, వార్డు నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితాపై అభ్యంతరాలకు అవకాశం : కలెక్టర్

ప్రజాశక్తి మచిలీపట్నం రూరల్ : ఫోటో ఓటర్ల జాబితాలో ఎలాంటి అభ్యంతరాలు ఉన్న తమ దష్టికి తీసుకువస్తే భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాలు ప్రకారం సరి చేస్తామని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి పి రాజాబాబు పేర్కొన్నారు.బుధవారం రాత్రి జిల్లా కలెక్టర్ నగరంలోని వారి ఛాంబర్ లో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించి ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమంపై సమీక్షించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఫోటో ఓటర్ల జాబితా పరిశీలన, సవరణ క్షేత్రస్థాయిలో ముమ్మరంగా జరుగుతోందన్నారు. ఇప్పటివరకు తాజా సమాచారంతో రూపొందించిన ఓటర్ల జాబితాను అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులకు అందజేశామని అందులో ఏమైనా అభ్యంతరాలు ఉంటే తన దష్టికి తీసుకొని రావాలని కోరారు.ఈ సందర్భంగా కొందరు ప్రతినిధులు ఒక ఓటరు చిరునామా ఒకచోట ఉంటే ఇంకొక చిరు నామాతో ఎపిక్ కార్డులు వస్తున్నాయని జిల్లా కలెక్టర్ దష్టికి తీసుకొని రాగా ఇది ఒక సాంకేతిక సమస్యని ఈ అంశాన్ని ఎన్నికల సీఈఓ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరి

రాజకీయ పార్టీల నాయకులతో మాట్లాడుతున్న కలెక్టర్

స్తామని కలెక్టర్ చెప్పారు. ఎపిక్ కార్డ్ సంఖ్య టైపు చేస్తే అందులో పోలింగ్ కేంద్రం ఎక్కడ ఉందో తెలుసుకునే విధంగా జిల్లాకు ఒక ప్రత్యేకమైన యాపును తయారు చేయాలని ప్రతినిధులు కోరగా అందుకు జిల్లా కలెక్టర్ స్పందిస్తూ ఆ యాపు విషయమై సీఈఓ కార్యాల యాన్ని సంప్రదించి తగిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సమావేశంలో డిఆర్ఓ పెద్దిరోజా, వైఎస్ఆర్సిపి, బిజెపి, బీఎస్పీ, టిడిపి ప్రతినిధులు షేక్ శిలార్ దాదా, పంతం వెంకట గజేంద్ర రావు, ఎస్ బాలాజీ, ఎస్.యశ్వంత్, తదితరులు పాల్గొన్నారు.

బాల్యవివాహాల నిర్మూలనపై అవగాహన

ప్రజాశక్తి-గుడివాడ : స్థానిక 2టౌన్ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో బాల్య వివాహాల నిర్మూలన పై అవగాహన సదస్సును బుధవారం నిర్వహించారు. 13వ వార్డులోని సచివాలయ ప్రాంగణంలో టూటౌన్ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో డియస్‌పి పి.శ్రీకాంత్ మాట్లాడుతూ బాలివివాహాల వల్ల కలిగే అనర్థాలను వివరించారు. బాల్య వివాహాలను అరికట్టడంలో తల్లిదండ్రులు

అవగాహన కలిగి ఉండాలని విజ్ఞప్తి చేశారు. ఈ అవగాహన సదస్సులో టూటౌన్ సి.ఐ తులసీధర్, ఆర్.ఐ నాగబాబు, ఆశ, అంగన్వాడి తదితర ప్రభుత్వ శాఖల ఉద్యోగులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పిట్టలంకలో 'జగనన్నే ఎందుకు కావాలి'

ప్రజాశక్తి-కోడూరు : కోడూరు మండలం పిట్టలంక గ్రామసచివాలయం పరిధిలోని బడేవారిపాలెం, పిట్టలంక గ్రామంలో 'ఆంధ్రప్రదేశ్ కు జగనన్నే ఎందుకు కావాలి' అనే కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ముందుగా గ్రామానికి జగనన్న ప్రభుత్వంలో అందిన సంక్షేమ వివరాలు గల బోర్డును ప్రారంభించి, సమావేశంలో జగనన్న ప్రభుత్వం చేసిన మంచిని వివరించి అనంతరం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కోడూరు మండలం కన్వీనర్ పరిసే మాధవరావు, సచివాలయల కన్వీనర్ కడవకోల్లు నివాసరావు, పిఎసిస్ అధ్యక్షులు భావిశెట్టి పులివేంద్రరావు ,వైసీపీ గ్రామ కమిటీ నాయకులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి పెదపారుపూడి :** మండలంలోని చినపారుపూడి గ్రామంలో ఆంధ్రప్రదేశ్ కు జగనన్నే ఎందుకు కావాలిఅనే కార్యక్రమం నిర్వహించారు. ముందుగా వైసిపి ప్రభుత్వంలో అందిన సంక్షేమ వివరాలు గల బోర్డును ప్రదర్శించారు. అనంతరం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ జెండాను ఆవిష్కరించారు.మండల అధ్యక్షుడు గోల్జ్ సోమేశ్వరరావు, సర్పంచి నగుళ్ల శ్రీనివాసరావు గ్రామ సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

శీతాకాల సమావేశాల్లో బిల్లు పెట్టాలి

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : ఎస్సీ వర్గీకరణ బిల్లు శీతకాల సమావేశాల్లో పెట్టాలని మండల ఎంఆర్పిఎస్ డిమాండ్ చేసింది. మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు దండు వీరయ్య మాదిగ పిలుపు మేరకు బుధవారం స్థానిక ధాణా ఫ్యాక్టరీ రోడ్డులో కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర నాయకులు కంచర్ల సుధాకర్ మాదిగ మాట్లాడుతూ 2014 లో బిజెపి పార్టీ అధికారంలోకి వస్తే వంద రోజుల్లో ఎస్సీ వర్గీకరణ చేస్తానని ప్రధానమంత్రి మోడీ హామీలు నేటి వరకు నెరవేరలేదని ఆవేదం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మండల ఎమ్మార్పీఎస్ నాయకులు కొమ్ముల పేరయ్య, జుజ్జువరపు ప్రశాంతి, రాయల ప్రభాకర్ పాల్గొన్నారు.

కులగణనకు కమిటీల ఏర్పాటు

ప్రజాశక్తి-మచిలీపట్నం రూరల్ : జిల్లాలో ఈనెల 27 నుండి ప్రారంభం కానున్న కుల గణన కార్యక్రమం సంబంధిత శాఖల సమన్వయంతో సజావుగా జరిగేందుకు జిల్లా మండల స్థాయి కమిటీలు ఏర్పాటు చేస్తూ జిల్లా కలెక్టర్ పి రాజాబాబు ఉత్తర్వులు జారీ చేశారు.కుల గణన సర్వే నిర్వహణకు జిల్లాస్థాయి కమిటీకి జిల్లా కలెక్టర్ చైర్మన్, జిల్లా జాయింట్ కలెక్టర్ వైస్ చైర్మన్ గాను, జిల్లా బీసీ సంక్షేమ సాధికారత అధికారి, జిల్లా ఎస్సీ సంక్షేమ సాధికారత అధికారులు ఇరువురు మెంబర్- కన్వీనర్లుగా, జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి (సిపిఓ) నోడల్ అధికారిగా వ్యవహరిస్తారని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి, జిల్లా ఎస్సీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, జిల్లా బీసీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, మచిలీపట్నం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్, జిల్లా గిరిజన సంక్షేమ సాధికారత అధికారి, జిల్లా మైనారిటీ సంక్షేమ సాధికారత అధికారి కమిటీ సభ్యులుగా వ్యవహరిస్తారని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. మండల స్థాయి కమిటీలలో మండల తాసిల్దార్ కమిటీ చైర్మన్ గా, మండల పరిషత్ అభివృద్ధి అధికారి కన్వీనర్ గా, మున్సిపల్ కమిషనర్, సహాయ గణన అధికారి (ఏఎస్ఓ), ఈవో (పి ఆర్ అండ్ ఆర్ డి), మండల ఇంజనీర్ (పి ఆర్), మండల విద్యాశాఖ అధికారి మరియు ఐసిడిఎస్ సూపర్వైజర్ సభ్యులుగా ఉంటారని కలెక్టర్ పేర్కొన్నారు.

ఘనంగా హీరో కృష్ణ వర్ధంతి

ప్రజాశక్తి-గుడివాడ : కౌబాయ్‌గా, జేమ్స్ బాండ్‌గా ప్రజలను అలరించిన నటుడు సూపర్ స్టార్ కృష్ణ అని టిడిపి నాయకుడు వెనిగండ్ల రాము అన్నారు. బుధవారం అభిమాన సంఘాల ఆధ్వర్యంలో సూపర్ స్టార్ కృష్ణ ప్రథమ వర్ధంతి సందర్భంగా అన్నాదాన కార్యక్రమాన్ని టిడిపి నాయకుడు వెనిగండ్ల రాము ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సూపర్ స్టార్ కష్ణ జీవితం కష్టపడే ప్రతి ఒక్కరికి ఆదర్శప్రాయంగా ఉన్నన్నారు. కష్ణ భౌతికంగా లేకపోయినా, ఆయన నటన ద్వారా అమరుడుగా జీవించే ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో కష్ణ, మహేష్ బాబు ఫ్యాన్స్ అసోసియేషన్ టౌన్ ప్రెసిడెంట్ వుకోటి శివాజీ, చిరంజీవి అభిమాన సంఘాల నాయకులు కందుల రవి, జనసేన నాయకులు బూరగడ్డ శ్రీకాంత్, సాయన రాజేష్ పాల్గొన్నారు.

ఎంఇఒ రవికుమార్ బాధ్యతల స్వీకారం

ప్రజాశక్తి-గన్నవరం : నూతనంగా గన్నవరం ఎం ఈ ఓ -1 గా కొండా రవికుమార్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం గన్నవరం మండల పరిషత్ అధ్యక్షులు అనగాని రవిని కలిశారు. విజయవాడ అర్బన్ లో పని చేస్తూ గన్నవరం కి బదిలీపై వచ్చారు. ఈ కార్యక్రమం లో ఎంఈఓ సత్యకుమార్, జడ్పీటీసీ కో ఆప్షన్ సభ్యులు ఎండ్ గౌసాని , చిక్కవరం సర్పంచ్ అన్నే లక్ష్మణరావు ,ముస్తాబాదా ఎంపీటీసీ సభ్యులు గూటాల భాగ్యరాజు పాల్గొన్నారు.

ఎంపీపీని కలిసిన నూతన ఎంఈఒ

వైసిపిలో చేరిక

ప్రజాశక్తి-గన్నవరం : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలోకి ఉంగుటూరు మండలం ముక్కపాడు గ్రామానికి చెందిన తెలుగు దేశం పార్టీ నాయకులు బుధవారం చేరారు. రాష్ట్రంలో వైఎస్ జగన్ మోహన్ రెడ్డి చేస్తున్న సంక్షేమ పథకాలు, గన్నవరం శాసన సభ్యులు డాక్టర్ వల్లభనేని వంశీ మోహన్ చేస్తున్న అభివద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులు అయ్యి వైస్సార్సీపీ లో చేరినట్లు వారు తెలిపారు. గన్నవరం నియోజకవర్గ కార్యాలయం లో వైస్సార్సీపీ పార్టీ కార్యాలయ ఇన్చార్జి మేచినేని బాబు సమక్షంలో చేరారు. ఈ కార్యక్రమం లో ముక్కపాడు గ్రామ వైస్సార్సీపీ నాయకులు సీతారామ రాజు , సూరపనేని అనీల్, మెండెం రాంబాబు, ఎలుకపాడు ,గ్రామ నాయకులు పాల్గొన్నారు.

మంచినీటి బావుల్లో క్లోరినేషన్

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : మండలంలోని శేరి దగ్గుమిల్లి గ్రామంలో మంచి నీటి బావులలో బుధవారం క్లోరినేషన్ చేసినట్లు కార్యదర్శి ఎ జె ఎల్. నరసింహారావు తెలిపారు. ఈ సంద ర్భంగా సర్పంచ్ జన్ను లక్ష్మీ రాణి మాట్లాడుతూ ప్రజలు అనారోగ్యానికి గురికాకుండా ఉండేందుకు గ్రామంలో గల నాలుగు మంచినీటి బావుల్లో క్లోరినేషన్ చేసినట్లుగా తెలిపారు. ఈ కార్యక్రమంలో సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్ సిబ్బంది పాల్గొన్నారు.

చలమలశెట్టికి అభినందనలు

ప్రజాశక్తి-హనుమాన్‌జంక్షన్: రానున్న ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి యార్లగడ్డ వెంకట్రావు విజయానికి కృషి చేస్తామని జనసేన గన్నవరం నియోజకవర్గ సమన్వయకర్తగా నియమితులైన చలమలశెట్టి రమేష్‌బాబు తెలిపారు. గన్నవరం నియోజకవర్గ జనసేన ఇంచార్జి గా, సమన్వయకర్తగా హనుమాన్ జంక్షన్ కు చెందిన చలమలశెట్టి రమేష్ బాబుని నియమిస్తూ జనసేన ప్రధాన కార్యాలయం నుండి ఆదేశాలు రావటం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ బాపులపాడు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు దయాల రాజేశ్వరరావు, జనసేన మండల పార్టీ అధ్యక్షుడు వడ్డి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో చలమలశెట్టిని కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో హనుమాన్ జంక్షన్ టిడిపి టౌన్ పార్టీ అధ్యక్షులు అట్లూరి శ్రీనివాస్, మాజీ సర్పంచులు దన్నే దుర్గారావు, చింతల వెంకట శివ అప్పారావు పాల్గొన్నారు.

వైసిపి పతాకావిష్కరణ

ప్రజాశక్తి-చల్లపల్లి సీఎం జగన్ పరిపాలనపై విశ్వాసంతో ప్రజలు మరోసారి వైసీపీ ప్రభుత్వం కోరుకుంటున్నారని వైసీపీ చల్లపల్లి మండల అధ్యక్షులు శీరం వెంకట సత్యనారాయణ (నాని) అన్నారు. బుధవారం సాయంత్రం చల్లపల్లి ప్రధాన కూడలిలో వైసీపీ పతాకాన్ని నాని ఆవిష్కరించారు. అగ్రహారంలో ఇంటింటికి వెళ్లి వైసీపీ మేనిఫెస్టో అమలు చేసిన విధానం, పేదలకు కలిగిన లబ్ది వివరించారు. గ్రామ సచివాలయంలో సంక్షేమ పథకాల బోర్డు ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏపీ ఉర్దూ అకాడమీ డైరెక్టర్ షేక్ దిల్ షాద్ నజరానా, లక్ష్మీపురం ఎంపీటీసీ సభ్యులు మోపిదేవి ద్వారకానాథ్, నూకల వెంకటేశ్వరరావు, మంగళాపురం సర్పంచ్ డొక్కు నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

ప్రజాశక్తి-హనుమాన్‌జంక్షన్ :: బాపులపాడు మండలం రంగన్న గూడెం గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ కార్యకర్త కొలుసు కష్ణ అనారోగ్యంతో బాధపడుతుండడంతో రంగన్న గూడెం రూరల్ డెవలప్మెంట్ సొసైటీ (ఆర్.ఆర్.డి.ఎస్) తరఫున గ్రామ ప్రముఖులు ఆర్.ఆర్.డి.ఎస్ కార్యదర్శి ఆళ్ళ వెంకట గోపాల కష్ణారావు, గ్రామ పెద్దలు కసుకుర్తి అర్జునరావు, పుసులూరు లక్ష్మీ నారాయణ, మువ్వ వేణుగోపాల్ చేతుల మీదుగా రూ.5,000 ఆర్థిక సహాయం అందజేశారు. వీరితో పాటుగా ఎంపీసీఎస్ అధ్యక్షులు మొవ్వా శ్రీనివాసరావు, ఆలపాటి రాంబాబు, కొలుసు సూరిబాబు తదితరులు ఉన్నారు.

ప్రజాశక్తి
www.prajasakti.com
కృష్ణాజిల్లా
గురువారం
16 నవంబర్ 2023

మహా ప్రవాహం

• మూడు కిలోమీటర్లు సాగిన రెడ్ డ్రెస్ కవాతు • విశేషంగా ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు • అడుగడుగునా పూల వర్షం • కిక్కిరిసిన బహిరంగ సభా ప్రాంగణం • ఆలోచింప చేసిన అగ్ర నేతల ప్రసంగాలు

ప్రజాశక్తి - విజయవాడ ప్రతినిధి, విజయవాడ, అర్బన్, వన్‌టౌన్

విజయవాడ నగరంలో ఎర్రసైన్యం ఉధృత ప్రవాహంలా సాగింది. సింగ్‌నగర్ మాకినేని బసవపున్నయ్య స్టేడియంలో బుధవారం జరిగిన సిపిఎం ప్రజారక్షణ భేరి మహా ప్రదర్శన, బహిరంగ సభలకు రాష్ట్రం నలుమూలల నుండి పార్టీ శ్రేణులు పెద్దఎత్తున కదలివచ్చాయి. దీంతో బిఆర్‌టిఎస్ రోడ్డు మధురానగర్ జంక్షన్ నుంచి ఫుడ్ కోర్టు జంక్షన్ వరకు వేలాది మందితో కిటకిటలాడింది. ఫుడ్ జంక్షన్ వద్ద నుండి ఎంబి స్టేడియం వరకు వేలాది మందితో మహా ప్రదర్శన సాగింది. రెడ్ డ్రస్ వాలంటీర్లు, సిపిఎం శ్రేణులు, అభిమానులు, అభ్యుదయవాదులు ఎంతో క్రమశిక్షణగా కదం తొక్కుతూ సుమారు మూడు కిలోమీటర్ల మేర సాగిన ఈ ప్రదర్శన నగర వాసులను విశేషంగా ఆకట్టుకుంది. కళాకారుల సాంస్కృతిక కళారూపాలు చూపురులను కట్టపడేశాయి. ముందు భాగాన డిజే మైక్, ప్రదర్శన మధ్యలో వాహనంపై నుండి ప్రజలకు అభివాదం చేస్తూ సిపిఎం అగ్రనేతలు సీతారామ్ ఏచూరి, బివి రాఘవులు, వి శ్రీనివాసరావు, ఎంఎ గఫూర్, పి మధు, సిహెచ్ బాబూరావు సాగారు. ముందు భాగాన రాష్ట్ర అగ్రనేతలు వై వెంకటేశ్వరరావు, వి.ఉమామహేశ్వరరావు, బి.తులసీదాస్, కిల్లో పురేంద్ర, మంతెన సీతారామ్, కె.సుబ్బరావమ్మ, డి రమాదేవితోపాటు కె.ధనలక్ష్మి, వై స్వరూపరాణి, ఎవి నాగేశ్వరరావు, కె.శ్రీదేవి తదితరులు భారీ బ్యానర్‌తో మహాప్రదర్శనలో నడిచారు. ఖాకీ ప్యాంట్, రెడ్ షర్ట్, తలపై టోపీతో రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.వెంకటేశ్వర్లు ఆకట్టుకున్నారు. వేలాది మంది రెడ్ డ్రెస్ వాలంటీర్ల కవాతు, మధ్య మధ్యలో సాంస్కృతిక బృందాల నృత్యాలు హైలెట్‌గా నిలిచాయి. ఎంతో క్రమశిక్షణగా సాగిన ఈ మహాప్రదర్శన ఎర్రదండు కదిలినట్లు, రెడార్మీ ఉరికినట్లు సాగిందని ర్యాలీ ఆసాంతం వీక్షించిన ప్రజలతోపాటు పోలీసులు సైతం వ్యాఖ్యానించడం కనిపించింది. ప్రతి ఒక్కరూ ఎర్ర జెండాతో నడిచారు. బిఆర్‌టిఎస్ రోడ్డు ఫుట్ జంక్షన్ నుంచి భగత్‌సింగ్ రోడ్, ముత్యాలంపాడు, బుడమేరు వంతెన, అల్లూరి సీతారామరాజు విగ్రహం, సింగ్‌నగర్ ఫ్లైఓవర్, డాబాకొట్లు సెంటర్ మీదుగా ఎంబి స్టేడియానికి మహా ప్రదర్శన చేరడానికి గంటన్నరకు పైగా సమయం పట్టింది. ఎంతో క్రమశిక్షణగా సాగిన ఈ కవాతు చూపురులను విశేషంగా ఆకట్టుకుంది. చిన్నారుల దగ్గర నుంచి వృద్ధుల వరకు మహా ప్రదర్శనలో పాల్గొన్నారు. జిల్లాల వారీగా తమ తమ బ్యానర్లు చేబూనారు. ఫుడ్ జంక్షన్ సెంటర్‌లో ప్రదర్శన ప్రారంభ సూచికగా పార్టీ అగ్రనాయకులు బివి రాఘవులు, శ్రీనివాసరావు, గఫూర్, మధు, బాబూరావు ఎర్రబెలూన్లు గాలిలోకి వదిలారు. సంఘటిత, అసంఘటిత రంగాల కార్మికులు, ముఠా, ఆటో, భవన నిర్మాణ, హమాలీ, షాపు ఎంప్లాయీస్, మున్సిపల్ కార్మికులు, మధ్యతరగతి ఉద్యోగులు, ఎల్ఐసి ఉద్యోగులు, న్యాయవాదులతోపాటు ఇంకా రంగాలకు చెందిన వందలాది మంది మహా ప్రదర్శనకు ఘన స్వాగతం పలుకుతూ పూల వర్షం కురిపించారు. ఆయా సంఘాల నేతలు సంఘీభావం తెలిపారు. సభలో పార్టీ అగ్రనేతలు చేసిన ప్రసంగాలు ఆలోపించ చేశాయి. కేంద్రంలో మోడీ, రాష్ట్రంలోని వైసిపి, టిడిపి, జనసేన పార్టీల అవకాశవాద రాజకీయాలు, మతోన్మాద ప్రమాదం, ప్రజలు ఇబ్బందులు, ప్రత్యమ్నాయ విధానాలపై నేతలు చేసిన ప్రసంగాలను ప్రజలు శ్రద్ధగా విన్నారు.

ప్రదర్శనకు సిపిఐ సంఘీభావం

మహా ప్రదర్శనలో సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరిని బుడమేరు వంతెన వద్ద సిపిఐ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు కలిసి పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో సిపిఐ సహాయ కార్యదర్శిలు లంక దుర్గారావు, నక్క వీరభద్రరావు, కార్యదర్శివర్గ సభ్యులు బుట్టి రాయప్ప, మూలి సాంబశివరావు, తాడి పైడయ్య, పంచదార్ల దుర్గాంబ పాల్గొన్నారు.

సంఘీభావం తెలుపుతున్న సిపిఐ నాయకులు

ఆకట్టుకున్న కళా ప్రదర్శనలు

కళాకారుల ప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకున్నాయి. కోలాటం, థింసా, కొమ్ము కోయలు, గురవయ్యల నృత్యం, డప్పు దరువులు, తప్పెటగుళ్ల నృత్యాలు ప్రదర్శించారు. అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు మండల నుంచి విచ్చేసిన 30 మంది కొమ్ము కోయలు నృత్య ప్రదర్శన చేశారు. విశాఖజిల్లా మల్కాపురం ప్రాంతానికి చెందిన కోలాట మహిళా దళం, డ్రమ్స్ వాయిద్యాల ప్రదర్శన, అనకాపల్లికి చెందిన 40 మంది కోలాట మహిళాదళం, కృష్ణాజిల్లా గన్నవరం మండలం నుండి 10 మంది డప్పుల దళం, తాడిగడపకు చెందిన 17 మంది పిల్లల కోలాటం, మైలవరం మండలం గణపవరంనకు 15 మంది కొమ్ము బూరలు, విజయవాడ సింగ్‌నగర్ 63వ డివిజన్ రాజీవ్‌నగర్ కోలాట దళం, శ్రీకాకుళం జిల్లా పలాసకు చెందిన 16 మంది తప్పెట గుళ్ల దళాలు చేసిన ప్రదర్శనలు, విన్యాసాలు కనువిందు చేశాయి.

దారిపొడవునా పూలవర్షం

మహా ప్రదర్శనలో నేతలపై మధ్యతరగతి ఉద్యోగుల ఐక్యవేదిక, పిఎన్ బస్‌స్టేషన్‌లోని సిటీ ఆటో వర్కర్స్ యూనియన్ (సిఐటియు), గవర్నమెంట్ ప్రెస్ ఏరియా ముత్యాలంపాడు సిపిఎం శాఖా సభ్యులు పెద్దఎత్తున స్వాగతం పలుకుతూ పూల వర్షం కురిపించారు. అలాగే ఆలిండియా లాయర్స్ యూనియన్ (ఐలు) విజయవాడ యూనిట్ నాయకత్వం బుడమేరు వంతెన సెంటర్‌లో ఘనంగా స్వాగతం పలికి పూలు చల్లారు. మహా ప్రదర్శనకు సంఘీభావం తెలుపుతూ సిపిఐ నగర సమితి కార్యదర్శి జి కోటేశ్వరరావు నేతృత్వంలో అల్లూరి సీతారామరాజు వంతెన సెంటర్‌లో స్వాగతం పలికి పూలు చల్లారు.

విస్తృతంగా ప్రజాప్రణాళిక అమ్మకాలు

ప్రజాశక్తి ప్రతులు పంపిణీ

అసమానతలు లేని అభివృద్ధి కోసం ప్రజారక్షణ బేరి సభ సందర్భంగా సిపిఎం ప్రచురించిన 'ప్రజాప్రణాళిక' ప్రత్యేక సంచికకు విశేష ఆదరణ లభించింది. ఈసంచికను సభా వేదికపై పార్టీ అగ్రనాయకులు సీతారాం ఏచూరి, బివి రాఘవులు ఆవిష్కరించారు. ప్రదర్శన, సభల్లో ఈ ప్రత్యేక సంచికను ప్రజాశక్తి సిబ్బంది విక్రయించారు. అలాగే మహా ప్రదర్శన, బహిరంగ సభ తాజా విశేషాలతో మధ్యాహ్నం సభ జరుగుతున్న సమయంలోనే అత్యంత వేగంగా తీసుకువచ్చిన ప్రజాశక్తి ప్రతులను విక్రయించారు. మరికొన్ని పంపిణీ చేశారు.

ప్రదర్శనలో పాల్గొన్న విశాఖ ఉక్కు పరిరక్షణ

విజయవాడలోని పలు డివిజన్ల నుంచి పాల్గొన్న కార్యకర్తలు

ప్రజాప్రణాళిక ప్రతులు చూపిస్తున్న నాయకులు, కార్యకర్తలు

కవాతు నిర్వహిస్తున్న రెడ్ వాలంటీర్లు

ప్రజానాట్యమండలి కళాకారుల పాటలు

కోలాటం నిర్వహిస్తున్న బాలలు

ప్రాంగణం వద్ద ప్రజాశక్తి బుక్ హౌస్ స్టాల్

ప్రదర్శనలో పాల్గొన్న డివి కృష్ణ, ఇతర నాయకులు

సాంస్కృతిక బృందాల నృత్యాల్లో పాల్గొన్న శ్రీనివాసరావు

సాంస్కృతిక, నాటిక ప్రదర్శనలు

సిహెచ్ బాబురావు

దోనేపూడి కాశీనాథ్

ప్రదర్శనలో పాల్గొన్న కార్యకర్తలు

కోలాటం నిర్వహిస్తున్న మహిళలు

సాంస్కృతిక బృందాల నృత్యాలు

బిజెపి విధానాలు ఖండిస్తూ ప్లకార్డుల ప్రదర్శన

సిపిఎం గొడుగులతో ఆకట్టుకున్న కార్యకర్తలు

ముత్యాలంపాడు గవర్నమెంట్ ప్రెస్ వద్ద పూలవర్షం కురిపిస్తున్న దృశ్యం

ఓటర్ల జాబితా రూపకల్పనకు సహకరించాలి

రాజకీయ పార్టీల నేతలతో డిల్లీరావు

రాజకీయ పార్టీల నాయకులతో మాట్లాడుతున్న కలెక్టర్

ప్రజాశక్తి-విజయవాడ
దోష రహిత తుది ఓటర్ల జాబితా రూపొందిస్తున్నామని, ఇందుకు రాజకీయ పక్షాలు తమ సహకారం అందించాలని జిల్లా కలెక్టర్ ఎస్.డిల్లీరావు కోరారు. గుర్తింపు పొందిన రాజకీయ పక్షాల ప్రతినిధులతో ప్రతి వారం నిర్వహించే సమావేశంలో భాగంగా బుధవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ ప్రత్యేక సంక్షిప్త సవరణ 2024లో భాగంగా అక్టోబర్ 27వ తేదీన ముసాయిదా ఓటర్ల జాబితా ప్రచురించడం జరిగిందన్నారు. దీనిపై డిసెంబర్ 9వ తేదీ వరకు అభ్యంతరాలు సవరణలకు దరఖాస్తులను స్వీకరించడం జరుగుతుందన్నారు. డిసెంబర్ 2, 3 తేదీల్లో స్పెషల్ క్యాంపైన్ డేస్ గా నిర్వహించి 18 సంవత్సరాలు నిండిన యువతను ఓటర్ల నమోదు జాబితాలో సవరణలను తీసుకోవడం జరుగుతుందన్నారు. డిసెంబర్ 26వ తేదీ నాటికి దోష రహిత తుది ఓటర్ల జాబితా ప్రచురించనున్నామన్నారు. జిల్లాలో ఈవియంల ఫస్ట్ లెవెల్ చెకింగ్ ప్రక్రియను విజయవంతంగా పూర్తిచేసి రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలిచామన్నారు. ఈ సమావేశంలో డిఆర్వో ఎస్.వి.నాగేశ్వరావు, ఎలక్షన్ సెల్ డిటి రాజేశ్వరి, సిపిఎం ఎన్‌టిఆర్ జిల్లా కార్యదర్శి డివి కృష్ణ, వైసిపి నాయకులు వై.ఆంజనేయరెడ్డి, టిడిపి నాయకులు ఎల్.శివరామప్రసాద్, కాంగ్రెస్ నాయకులు పి.ఏసుదాసు పాల్గొన్నారు.

తుది ఓటర్ల జాబితాను రూపొందించాలి

ప్రత్యేక సంక్షిప్త సవరణలో భాగంగా తప్పులు లేని తుది ఓటర్ల జాబితా రూపొందించాలని జిల్లా కలెక్టర్ ఎస్ డిల్లీరావు అధికారులను ఆదేశించారు. తుది ఓటర్ల జాబితా, గృహ నిర్మాణాలు, జగనన్నకు చెబుదాం, జగనన్న ఆరోగ్య సురక్ష తదితర అంశాలపై బుధవారం కలెక్టరేట్ నుండి డివిజనల్ ఆఫీసర్లు, మున్సిపల్ కమీషనర్లు, స్పెషల్ ఆఫీసర్లు, తహశీల్దార్లు, ఎంపిడివోలు, సంబంధిత శాఖల ఇతర అధికారులతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 18 సంవత్సరాలు నిండిన యువ ఓటర్ల నమోదుపై సంబంధిత ఏఇఆర్‌వోలు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. నియోజకవర్గం నుండి వేరే నియోజకవర్గానికి వలస వెళ్లిన, శాశ్వత వలస వెళ్లిన ఓటర్లకు సంబంధించి జాబితాను సూక్ష్మ పరిశీలన చేయాలన్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాలో నిర్వహించిన ఫస్ట్ లెవల్ చెకింగ్‌లో భాగంగా జిల్లాలోని 1,605 బ్యాలెట్ యూనిట్లు, 1,605 కంట్రోల్ యూనిట్ 1,695 వివిప్యాట్స్ మొత్తంగా 5,700లను రెవెన్యూ, ఎన్నికల సిబ్బంది, ఫస్ట్ లెవల్ చెకింగ్‌ను విజయవంతంగా పూర్తి చేశారన్నారు. ఫస్ట్ లెవల్ చెకింగ్ పూర్తి అయిన తొలి జిల్లాగా ఎన్‌టిఆర్ జిల్లా గుర్తింపు పొందడం పట్ల కలెక్టర్ డిల్లీరావు రెవెన్యూ, ఎన్నికల అధికారులు, సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించారు.

అక్రమ మద్యంపై నిఘా పెట్టండి

ప్రభుత్వ నిబంధనలు మేరకు మద్యం పాలసీని ఖచ్చితంగా అమలు చేయడంతో పాటు మద్యం అక్రమ రవాణా నిల్వలు అమ్మకాలపై గట్టిగా నిఘా పెట్టాలని జిల్లా కలెక్టర్ ఎస్ డిల్లీరావు ఎక్సైజ్ అధికారులను ఆదేశించారు. ఎక్సైజ్ పాలసీ నిబంధనల అమలపై బుధవారం సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ ఎస్ డిల్లీరావు నగరంలోని ఆయన క్యాంప్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల మేరకు మద్యం పాలసీని ఖచ్చితంగా అమలు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో 122 బార్‌లు 119 షాపుల ద్వారా మద్యం అమ్మకాలను నిర్వహించడం జరుగుతుందన్నారు. మద్యం అక్రమ రవాణా నిల్వలు చేసే వారిపై కఠిన చర్యలు చేపట్టాలన్నారు. మద్యం అమ్మకాల సమయాలను తు.చ.తప్పకుండా పాటించేలా చూడాలని కలెక్టర్ ఎక్సైజ్ అధికారులకు సూచించారు. అనుమతులు లేని బ్రాండులను విక్రయించే బార్లు పై చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా సరిహద్దు ప్రాంతాలలో వాహనాల తనిఖీ పై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఇతర రాష్ట్రాల నుండి నాన్ డ్యూటీ పేయిడ్ మద్యం రాష్ట్రంలో విక్రయించకుండా గట్టి నిఘా పెట్టాలని సూచించారు. జిల్లాలో కాపు సారా తయారీ పై ఎప్పటికప్పుడు నిఘా పెట్టి కాపు సారా తయారీని పూర్తిగా అరికట్టాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో జిల్లా ఎక్సైజ్, ప్రొహిబిషన్ అధికారి టి. శౌరి, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అదనపు ఎస్పీ రామకృష్ణప్రసాద్, అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ యు. సుబ్బారావు, గొల్లపూడి ఎక్సైజ్ డిపో మేనేజర్ కాశీ విశ్వేశ్వరరావు, ఎక్సైజ్ స్టేషన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు పి. శ్రీనివాస్, రాజ్యలక్ష్మి, నికసన్, జె. రామేష్, సబ్ ఇన్‌స్పెక్టర్లు కె.ఎస్ చంద్రశేఖర్, వై ఈశ్వరరావు పాల్గొన్నారు.

సిపిఎం బహిరంగ సభ, ప్రదర్శన హైలైట్స్

- రాష్ట్ర నలుమూలల నుంచి తరలి వచ్చిన సిపిఎం శ్రేణులు
- రెడ్ డ్రెస్ వాలంటీర్లతో ఎరుపెక్కిన బెజవాడ
- మహా ప్రదర్శనలో ఐదేళ్ల పిల్లల దగ్గర నుంచి 70 ఏళ్ల వృద్ధుల వరకు భాగస్వామ్యం
- బస్సులు, రైళ్లు, లారీలు, మినీ వాహనాల్లో తరలి వచ్చిన జనం
- బిఆర్‌టిఎస్ రోడ్డు నుంచి సింగ్‌నగర్ వరకు ఎటు చూసినా జన సంద్రమే
- క్రమశిక్షణతో సాగిన కవాతు
- పోలీసులకు పని లేక ప్రేక్షకపాత్ర....
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అవకాశవాద రాజకీయాలకు వ్యతిరేకంగా మారుమోగిన నినాదాలు
- ఘన స్వాగతం పలుకుతూ, పూల వర్షం కురిపిస్తూ అభిమానాన్ని చాటుకున్న పలు సంఘాల నాయకులు, కార్యకర్తలు
- కేంద్రంలోని బిజెపి, రాష్ట్రంలోని అధికార వైసిపి, ప్రతిపక్ష టిడిపి, జనసేన పచ్చి అవకాశవాద రాజకీయాలను ఎండగడుతూ సాగిన నేతల ప్రసంగాలు
- అసమానతలు లేని అభివృద్ధి, ప్రత్యామ్నాయ విధానాలను సుస్పష్టం చేసిన సిపిఎం ప్రజాప్రణాళిక
- వేలాదిగా తరలివచ్చిన జనంతో విజయవంతమైన మహా ప్రదర్శన, బహిరంగ సభ
- సిపిఎం శ్రేణుల్లో ఉత్సాహం నింపిన ప్రదర్శన
- రాష్ట్ర నలుమూలల నుంచి తరలివచ్చిన సాంస్కృతిక కళా బృందాలు
- హాజరైన వారిలో అత్యధికులు మహిళలే
- సిపిఎం జెండాలు, తోరణాలు, ఫ్లెక్సీలు, బ్యానర్లు, హోర్డింగ్‌లతో నిండిన బెజవాడ

ప్రదర్శనను ప్రారంభిస్తున్న జెసి సంపత్‌కుమార్

పుస్తకాలు గొప్ప స్నేహితులు : జెసి

ప్రజాశక్తి-విజయవాడ: పుస్తకాలు గొప్ప స్నేహితులు వంటివని, పుస్తక పఠనం ద్వారా సంపాదించిన జ్ఞానాన్ని ఎప్పటికీ మర్చిపోలేమని జిల్లా జాయింట్ కలెక్టర్ డా. పి.సంపత్ కుమార్ అన్నారు. 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల స్థానిక ఠాగూర్ స్మారక గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శనను జెసి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి ఆధునిక కాలంలో సాంకేతికత ఎంత అభివృద్ధి చెందినా పుస్తకానికి ఉన్న ఆదరణ తగ్గలేదని, పుస్తక పఠనం ద్వారా తెలుసుకొన్న జ్ఞానం జీవితంలో ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. విద్యార్థి దశలో అకడమిక్ పుస్తకాలతో పాటు గొప్పవారి జీవిత చరిత్రలు, చారిత్రక ఔన్నత్యం కలిగిన ఘటనల పుస్తకాలు, శాస్త్రీయ దక్పథాన్ని అలవరిచే పుస్తకాలు వంటివాటిని కూడా చదవాలని సూచించారు.. జిల్లా గ్రంథాలయ సంస్థ జిల్లాలోని గ్రంథాలయాల అభివద్ధికి ప్రణాళికాయుత చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్‌పర్సన్ తిప్పరమల్లి జమల పూర్ణమ్మ, గ్రంథాలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు 'నాకు నచ్చిన నా కథ, కవిత'

ప్రజాశక్తి-విజయవాడఅర్బన్: 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా ఈ నెల 16వ తేది గురువారం సాయంత్రం ఆరు గంటలకు స్థానిక మహాత్మగాంధీ రోడ్డులోని ఠాగూర్ స్మారక గ్రంథాలయంలో రమ్యభారతి సాహిత్య వేదిక - జి.ఆర్.కె.పోలవరపు సాంస్కృతిక సమితి సంయుక్త ఆధ్వర్యంలో రచయితలు, కవులతో 'నాకు నచ్చిన నా కథ, కవిత' ప్రసంగ కార్యక్రమం నిర్వహించనున్నట్లు రమ్యభారతి వ్యవస్థాపక కార్యదర్శి చలపాక ప్రకాష్ ఓ ప్రకటనలో తెలిపారు. జి.ఆర్.కె పోలవరపు సాంస్కృతిక సమితి అధ్యక్షులు గోళ్ళ నారాయణరావు సభాధ్యక్షత వహించనుండగా కృష్ణాజిల్లా గ్రంథాలయ సంస్థ చైర్ పర్సన్ తిప్పరమల్లి జమల పూర్ణమ్మ ముఖ్య అతిథిగా పాల్గొంటారని పేర్కొన్నారు. నగరంలోని కవులు, రచయితలు ఈ కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

కమ్యూనిటీ హాలుకు శంకుస్థాపన

ప్రజాశక్తి-అవనిగడ్డ: పంచాయతీ పరిధిలోని ఎనిమిదో వార్డులో ఎన్‌టిపిసి సంస్థ సహకారంతో రూ.65 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించనున్న మల్లీపర్పస్ కమ్యూనిటీ హాలుకు ఎంపీ వల్లభనేని బాలశౌరి, ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబుతో కలిసి బుధవారం శంకుస్థాపన చేశారు. అనంతరం జరిగిన సభలో ఎంపీ మాట్లాడుతూ సమాజంలో అన్ని వర్గాల ప్రజలకు మంచి వసతులతో కూడిన సదుపాయాలు కల్పించడం ఎంపీగా తన బాధ్యత అని తెలిపారు. అందుకే అవనిగడ్డ పట్టణ పరిధిలోని ఎనిమిదో వార్డులో ఉంటున్న ఎస్సీ సామాజిక వర్గం కోసం ఓ కమ్యూనిటీ హాల్ ఉంటే బాగుంటుంది అన్న ఉద్దేశంతో ఎన్ని ఇబ్బందులు వచ్చినా వాటిని అధిగమించి భవన నిర్మాణానికి శంకుస్థాపన చేసుకున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ తుంగల సుమతి దేవి, జడ్పిటిసి చింతలపూడి లక్ష్మీనారాయణ మాజీ సర్పంచ్ నలకుర్తి పద్మ రాజు, అధికార ప్రతినిధి సింహాద్రి వెంకటేశ్వరరావు, రేపల్లె శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఎల్‌వి ప్రసాద్ నేత్ర వైద్యశాల ఆధ్వర్యంలో 19న నేత్ర సంరక్షణా వాక్

ప్రజాశక్తి-హెల్త్ యూనివర్శిటీ
బాలల నేత్ర సంరక్షణా వారోత్సవాలలో భాగంగా నగరంలోని ఎల్.వి. ప్రసాద్ నేత్ర వైద్యశాల ఆధ్వర్యంలో ఈనెల 19వ తేదీన నేత్ర సంరక్షణ వాక్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు హాస్పటల్ వైద్యులు డాక్టర్ కృష్ణప్రియ తెలిపారు. ఈసందర్భంగా హాస్పటల్ కాన్ఫరెన్స్‌హాల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలను తెలియచేశారు. నేత్ర సంరక్షణా వాక్ 19వ తేదీ ఆదివారం ఉదయం 7 గంటలకు తాడిగడప ఆసుపత్రి వద్ద ప్రారంభమవుతుందన్నారు. ఈర్యాలీ సందర్భంగా కంటిని సంరక్షించుకునే విధానాలను ప్రముఖ వైద్యులు తెలియచేస్తారన్నారు. ముఖ్యంగా చిన్న పిల్లలు కంటి సమస్యలపై అవగాహన కల్పించడంతో పాటు వారికి నేత్రాలను ఏవిధంగా కాపాడుకోవాలో తెలియచేయడమే ఈ వాక్ ప్రధాన ఉద్దేశమని తెలిపారు.

వాటర్ స్పోర్ట్స్ క్రీడాకారులకు ప్రశంస

ప్రజాశక్తి-విజయవాడ: 37వ నేషనల్ గేమ్స్ వాటర్ స్పోర్ట్స్‌లో వెండి పతకం సాధించిన క్రీడాకారులు ఎన్ గాయత్రి, భార్గవి, చిన్నలను విఎంసి కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ బుధవారం ప్రశంసించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాటర్ స్పోర్ట్స్‌లో క్రీడాకారులను పెంచేందుకు, వారిని ప్రోత్సహించేందుకు నగరపాలక సంస్థ నుండి ఎటువంటి సదుపాయాలు కావాలన్నా కల్పిస్తామన్నారు. కెనోయింగ్, కయాకింగ్ అసోసియేషన్ వాటర్ స్పోర్ట్స్ కోసం ఎటువంటి సహాయ సహకారాలు కావాలన్నా విఎంసి తోడుగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో బలరాం నాయుడు, జగదీష్, శ్రీనివాస్, బాబురావు పాల్గొన్నారు.

మొదటిపేజీ తరువాయి

గిరిజన వీరుల పోరాటం మరువలేనిది

తెలియజెప్పాలన్నారు. గౌరవ్ దివస్ కార్యకలాపాలు, లక్ష్యాలు కేవలం వేడుకలకే పరిమితం కాకుండా భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని గిరిజన ప్రజల అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అందరూ తప్పక ప్రోత్సహించాలన్నారు. అనంతరం జిల్లాలోని గిరిజన ప్రముఖులకు, గిరిజన సంక్షేమం కోసం పాటుపడుతున్న అధికారులకు, సంఘ నాయకులకు సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో మచిలీపట్నం నగరపాలక సంస్థ మేయర్ చిటికెన వెంకటేశ్వరమ్మ, జిల్లా రెవెన్యూ అధికారిణి పెద్ది రోజా, కార్పొరేటర్ ఏకశిరి వెంకటేశ్వరరావు, జిల్లా గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ ముదిగొండ ఫణి ధూర్జటి పాల్గొన్నారు.

మహారాజశ్రీ తిరువూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
ఓ.ఎస్.నెం.217/2021 & ఐ.ఏ.నెం.381 /2021
బిట్వీన్:
వనమా వెంకటేశ్వరరావు .... వాది
కొత్తూరు మోహన్ రావు మరియు ముగ్గురు ....ప్రతివాదులు
పై నెంబరు దావాలో మరియు ఐఎలో ఎన్ని పర్యాయా లు మీలో ఒకటవ వారైనా కొత్తూరు మోహన్ రావు గారికి సమన్లు మరియు నోటీసులు పంపినా గానీ మీరు తీసుకోకుండా కాలయాపన చేయుచున్నారు. కావున పై నెంబ రు దావాలోని మరియు ఐఎ లోని మీ హాజరు నిమిత్తం ది.18 -12- 2023 వ తేదీన వాయిదా వేసి ఉన్నారు కాబట్టి మీరు వాయిదా రోజున ఉదయం 10:30 గంటలకు స్వయంగా గానీ, ప్లీడరు గారి ద్వారా గానీ హాజరై ఆక్షేపణలు తెలియపరచ వలెను. లేనియెడ ల మీ పరోక్షముగా విచారణ జరిపి తీర్మానించబడునని ఇందుమూలముగా మీకు తెలియజేయడమైనది.
శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం
తిరువూరు
ది.14-11-2023. మేకల రవి, న్యాయవాది
తిరువూరు, సెల్ :9491958845

NOTICE
IN THE COURT OF THE HON'BLE
VIII ADDL.DIST.JUDGE::VIJAYAWADA
A.S.No: 50/2016
Between:
Andhra Pradesh Capital Region Development Authority, Vijayawada
(Formerly known as VGTM UDA)
Rep.by its Commissioner ...Appellant
And
Morla Vijaya & Others ...Respondents
To,
R-4: Motha Prathima Priyadarshini,
D/o. B.V.Prasanna Kumar,
R-5: Perikala Prasanthi,
D/o.Late B.V.Prasanna Kumar,
R-6: Bollapalli Sandeep,
S/o.Late B.V.Prasanna Kumar,
All are R/o.Door No:40-9/4-2/1,Plot No:103A,Municipal Employees Colony, Opp.Pinnamaneni Poly Clinic, Patamata, Vijayawada.
పై నెంబరు అప్పీలు పిటీషనులో 4 నుండి 6వ రెస్పాండెంట్లు అయిన మీకు శ్రీ కోర్టు వారి ద్వారా నోటీసులు పంపబడినను మీరు తీసుకొనక కాలయాపన చేయుచున్నందున శ్రీ కోర్టు వారు మీకు Subsituted Service ద్వారా పేపరులో ప్రకటన ద్వారా తెలియపరచవలని ఆర్డరు వేయగా, సదరు ఆర్డరు ప్రకారము మీరు ది:28-11-2023న ఉ. గం.10-30 ని.లకు పై కోర్టువారి యెదుట మీరు స్వయంగా కాని, మీ అడ్వకేటు ద్వారా గాని హాజరు అయి మీ ఆక్షేపణలు తెలియపరచుకొనవలయును. లేనియెడల మీ పరోక్షమందు విచారించి తీర్మానించ బడునని తెలియపర్చడమైనది.
(శ్రీ కోర్టు వారి అనుమతితో)
వాయిదా తేది:28-11-2023
పసుపులేటి నరసింహారావు,
అప్పీలెంట్ తరపు అడ్వకేటు,
13/2 అరండల్ పేట,
గుంటూరు,సెల్:9848334346

అన్న క్యాంటీన్ ప్రారంభం

ప్రజాశక్తి - తిరువూరు : కేశినేని చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కేశినేని శివనాథ్ (చిన్ని) తిరువూరు మధిర రోడ్డు సెంటర్‌లో ఏర్పాటు చేసిన అన్న క్యాంటీన్ మాజీ మంత్రి నక్కా ఆనంద్ బాబు బుధవారం ప్రారంభించారు. పేదలకు స్వయంగా అయన భోజనం వడ్డించారు. ఈ కార్యక్రమంలో కేశినేని శివనాథ్ (చిన్ని)తో పాటు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బిసిలను మోసం చేసిన వైసిపి

ప్రజాశక్తి - వన్‌టౌన్ : బీసీలను గత నాలుగు సంవత్సరాలుగా వైసీపీ ప్రభుత్వం మోసం చేసిందని,ఇప్పుడు బీసీల బస్ యాత్ర బస్సుయాత్రగా మారిపోయిందని, వైసీపీ బస్సుయాత్రకి జనాలు లేక వాయిదా వేసుకున్నారని మాజీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న విమర్శించారు. బుధవారం తన కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ పోలీసులని అడ్డుపెట్టుకొని బస్‌యాత్రలు చేస్తున్నారని, ఎక్కడికి వెళ్లినా ప్రజలు నిలదీస్తున్నారన్నారు. 33మంది బీసీలను ఊచకోత కోసినచరిత్ర వైసీపీదని అన్నారు. తనపై 44 కేసులు పెట్టారని వెంకన్న అన్నారు. పోలీసులు నిష్పక్షపాతంగా వ్యవహరించాలని, లేకుంటే తర్వాత ఇబ్బందులు పడక తప్పదని హెచ్చరించారు. ఈ సమావేశంలో52 వ డివిజన్ కార్పొరేటర్ ఉమ్మడి వెంకటేశ్వరరావు, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

రేపు జగనన్నకు చెబుదాం

ప్రజాశక్తి వత్సవాయి : మండల కేంద్రమైన వత్సవాయిలో జిల్లా పరిషత్ హై స్కూల్‌లో జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు హాజరవుతున్నట్లు మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు కొలుసు రమాదేవి, జడ్పిటిసి ఏసుకోగు దేవమని తెలిపారు. శుక్రవారం ఉదయం 10 గంటలకు మండల స్థాయి అధికారులు, మండల స్థాయి అధికారులు సచివాలయ సిబ్బంది సర్పంచులు ఎంపిటిసిలు తప్పక హాజరు కావాలని కోరారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వ విప్ స్థానిక శాసన సభ్యులు సామినేని ఉదయభాను హాజరవుతున్నట్లు పేర్కొన్నారు.

సామాజిక సేవలో ఆనందం

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : తమ కష్టార్జితంలో కొంత భాగమును సామజిక సేవకు ఉపయోగించటమే తమ సంస్థ ముఖ్య ఉద్దేశం అని రౌండ్ టేబుల్ ఇండియా విజయవాడ విభాగం చైర్మన్ కిరాట్ సింగ్ పేర్కొన్నారు. రౌండ్ టేబుల్ ఇండియా, లేడీస్ సర్కిల్, అమత హస్తం సంయుక్త ఆధ్వర్యంలో మీసాల రాజారావు వంతెన దగ్గర పెజ్జోనిపేటలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సంస్థ ఏరియా సెక్రటరీ కౌశిక్ యక్కల, కార్యదర్శి శ్రీకర్, లేడీస్ సర్కిల్ ఏరియా చైర్పర్సన్ శాంతి, డాక్టర్ శ్రీ హర్ష, డాక్టర్ ప్రఫుల్, రాఘవ, జాస్మిన్, మరియు డాక్టర్ ఆదిత్య ఈ కార్యక్రమములో పాల్గొని అన్న వితరణ చేశారు. మాట్లాడుతూ రౌండ్ టేబుల్ ఇండియా స్వచ్ఛంధ సంస్థ మరియు అమత హస్తం ఆధ్వర్యంలో నేడు సుమారు 600 మంది పేదలకు అన్నదానం కార్యక్రమ నిర్వహించినట్లు తెలిపారు. 20 మంది సభ్యులు ఉన్నారని, అందరూ ఇటువంటి సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటారని చెప్పారు. ఈ సంస్థ ఆధ్వర్యంలో పరిసర ప్రాంతాలలోని విద్యార్థులకు , మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. విద్య ద్వారా వికాసం అనే నినాదం తో ముందుకి సాగుతున్నట్లు వివరించారు.

అన్నదానం చేస్తున్న దృశ్యం

రాజ్యాంగ లక్ష్యాలను పరిరక్షించుకోవాలి

వివిధ సంఘాల నేతలు

చర్చా పత్రాన్ని విడుదల చేస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-విజయవాడ : రాజ్యాంగ లక్ష్యాలను, ప్రజాస్వామిక విలువలను కాపాడుకోవాల్సిన ఆవశ్యకత ఓటర్లపై ఉందని జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకులు కోట వెంకటేశ్వరరెడ్డి అన్నారు. జన విజ్ఞాన వేదిక సాంస్కృతిక విభాగం సౌజన్యంతో ఆల్ ఇండియా ఘంటసాల చైతన్య వేదిక, అభ్యుదయ భావాల వేదిక, సోదర సంఘాలు తెలుగు కళావాహిని, జీఆర్‌కె పోలవరపు సాంస్కృతిక సమితి, శ్రీ కళాభారతి కోట ఝాన్సీ రాణి కళావేదిక సంయుక్త ఆధ్వర్యంలో విజయవాడలోని ప్రెస్ క్లబ్‌లో బుధవారం భారత రాజ్యాంగం- ప్రజాస్వామ్యం- ఎన్నికలు- ఓటరు చైతన్యం ప్రజాస్వామ్యానికి పంచ ప్రమాదాలు, దామాషా ఎన్నికల విధానం ఆవశ్యకతపై మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కోట వెంకటేశ్వర రెడ్డి మాట్లాడుతూ ఊరూరా జనవిజ్ఞానం కార్యక్రమంలో భాగంగా పంచ ప్రమాదాలు మన కర్తవ్యాలు, దామాషా ఎన్నికల విధానం ఆవశ్యకతపై విస్తృతంగా ప్రచారం చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగు కళావాహిని అధ్యక్షులు చింతకాయల చిట్టిబాబు, జన విజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకులు కె రంగారెడ్డి, ఆనంద్, శ్యామ్, నాగమణి, ఝాన్సీ, తదితరులు పాల్గొన్నారు. జీఆర్‌కె పోలవరపు సాంస్కృతిక సమితి నాయకులు గోళ్ల నారాయణరావు తొలుత కార్యక్రమాన్ని ప్రారంభించారు.

కామినేని ఆస్పత్రిని పరిశీలించిన జిల్లా వైద్యాధికారి

ఆస్పత్రిని పరిశీలిస్తున్న వైద్యాధికారి జి.గీతాబాయి

ప్రజాశక్తి - హెల్త్ యూనివర్శిటీ : తాడిగడపలోని కామినేని హాస్పటల్‌ను జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ జి.గీతాబాయి బుధవారం ఉదయం పరిశీలించారు. ఈసందర్భంగా హాస్పటల్‌లో ఏఆర్‌టి చట్టం ద్వారా సహాయ పునరుత్పత్తి సాంకేతిక కేంద్రాన్ని ఏర్పాటుచేసేందుకు కావాల్సిన సదుపాయాలు, ఏర్పాట్లను పరిశీలించారు. ఈసందర్భంగా వైద్యాధికారిణి డాక్టర్ గీతాబాయి మాట్లాడుతూ చట్టం ప్రకారం ప్రతి వైద్యశాల తప్పనిసరిగా నమోదు చేసుకోవాలన్నారు. అసిస్టెంట్ రీప్రొడక్టివ్ టెక్నాలజీ ద్వారా ప్రజలలో ఉన్న వంధ్యత్వం పరిష్కరించడానికి ప్రధానంగా ఈకేంద్రం ద్వారా సూచనలను అందించనున్నట్లు తెలిపారు. ఈ ఎఆర్‌టి ద్వారా సంతాన ఉత్పత్తి చికిత్స చేయడానికి కావాల్సిన మానవ వనరులు, యంత్ర సామాగ్రి, సాంకేతికపరమైన పరికరాలు మొదలైన వాటిని పరిశీలించినట్లు తెలిపారు. ఆసుపత్రిలో రోగులకు అందించే వైద్య సేవలను, వాటి ధరల పట్టికలను ఆమె పరిశీలించారు. ఈ కార్యక్రమంలో గైనకాలజిస్టు డాక్టర్ అనూరాధ, రేడియోలాజిస్టు డాక్టర్ వినీల్, పేతాలజిస్టు డడాక్టర్ కళ్యాణి, సోషియాలజిస్టు డాక్టర్ శ్రావణి, హెల్త్ ఎడ్యుకేటర్ బి.రాజేంద్ర కుమార్ పలువురు వైద్యులు పాల్గొన్నారు.

నేడు సోషల్ ఆడిట్ ప్రజా వేదిక

ప్రజాశక్తి వత్సవాయి : మండల కేంద్రమైన వత్సవాయి మండల పరిషత్ కార్యాలయంలో నెల 16న ఉదయం 10 గంటలకు మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం సోషల్ ఆడిట్ ప్రజావేదిక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మండల పరిషత్ సూపరెంట్ బి.రాజు తెలిపారు. 2022 సంవత్సరం ఏప్రిల్ నుండి 2023 మార్చి వరకు జరిగిన పనుల్లో భాగంగా అక్టోబర్ 25 నుండి నవంబర్ 8 వరకు 25 గ్రామపంచాయతీలో 15వ విడత సామాజిక తనిఖీ నిర్వహించారు. ఈ తనిఖీల్లో భాగంగా సోషల్ ఆడిట్ ప్రజావేదిక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

తగిన చికిత్సతో సిఒపిడి దూరం

ప్రజాశక్తి - హెల్త్ యూనివర్శిటీ : క్రానిక్ అబ్స్ట్రక్టివ్ పల్మనరీ డిసీజ్ (సిఒపిడి) ప్రధాన సమస్యగా ఉందని ముందుగానే గుర్తించి తగిన చికిత్స తీసుకుంటే ఎటువంటి సమస్యలు ఉండవని ప్రముఖ పల్మనాలజిస్టు అండ్ ఇంటెన్సివిస్ట్ డాక్టర్ కె.అనిల్ కుమార్ అన్నారు. ప్రపంచ సిఒపిడి దినోత్సవం సందర్భంగా నగరంలోని మెడికల్ అసోసియేషన్ కార్యాలయంలో అవగాహనా కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ ఆరోగ్య విధానంలో 2025 నాటికి దీర్ఘకాలిక శ్వాసకోశ, సహజంగా సంక్రమించని వ్యాధుల వల్ల కలిగే మరణాలను 25 శాతం తగ్గించాలని లక్ష్యంగా పెట్టుకున్నారన్నారు. ఈ సందర్భంగా క్రానిక్ అబ్స్ట్రక్టివ్ పల్మనరీ డిసీజ్ అనేది ప్రధాన సమస్యగా ఉందన్నారు. ఎందుకంటే ఈ వ్యాధి దేశంలో మరణాలు, ఎక్కువగా వస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రధానంగా ఈ సమస్య ఉందని గుర్తించిన వారిలో 54 శాతం మందికి వ్యాధి గురించి అవగాహన లేదన్నారు. ప్రపంచ సిఒపిడి దినోత్సవం సందర్భంగా ప్రజలకు వ్యాధి గురించి అవగాహన కల్పించడంతో పాటు సమస్యతో ఇబ్బంది ఉన్న వారికి నియంత్రణ ఎలాగో తెలియచేయడమని అన్నారు. శ్వాస అనేది జీవితం ముందుగా చర్య తీసుకోండి అనే థీమ్‌తో అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు వైద్యులు, నగర ప్రముఖులు పాల్గొన్నారు.

విజయవాడ తరలిన సిపిఎం శ్రేణులు

ప్రజాశక్తి - చందర్లపాడు : విజయవాడ మాకినేని బసవ పున్నయ్య స్టేడియంలో జరుగుతున్న సిపిఎం ప్రజారక్షణ భేరికి ఎన్‌టిఆర్ జిల్లా నుండి నాయకులు పెద్ద సంఖ్యలో తరలి వెళ్లారు. చందర్లపాడు మండలం నుండి సిపిఎం జిల్లా కమిటీ సభ్యుడు చనుమోలు సైదులు, శాఖ కార్యదర్శి షేక్ హస్సేన్, తదితరులు వెళ్లారు. **వీరులపాడు :** మండలంలో జుజ్జూరు దొడ్డ దేవరపాడు వీరులపాడు అల్లూరు పెద్దాపురం పొన్నవరం గ్రామాల నుండి సిపిఎం మండల కార్యదర్శి చట్ల రవి తదితరులు పాల్గొన్నారు. **పెనుగంచిప్రోలు :** నాయకులు కార్యకర్తలు మహిళలు శ్రీ తిరుపతమ్మ అమ్మవారి దేవస్థానం వద్దకు చేరుకుని నినాదాలు చేసుకుంటూ సభకు వాహనాల్లో వెళ్లారు. ఈ కార్యక్రమంలో మండల సిపిఎం కార్యదర్శి గురవయ్య, సిఐటియు కార్యదర్శి దారా నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు. **రెడ్డిగూడెం :** మండలం నుంచి సిపిఎం శ్రేణులు - ఆ పార్టీ అనుబంధ సంఘాల నాయకులు తరలివెళ్లారు. సిపిఎం మండల కార్యాలయం వద్ద సిఐటియు నాయకులు కొండపల్లి పరమేశ్వరరావు, దొండపాటి సురేష్, సిపిఎం నాయకులు పాల్గొన్నారు. **జగ్గయ్యపేట:** మండలం నుండి సుమారు 300 మంది తరలివెళ్లారు. మండలంలోని షేర్ మహమ్మద్ పేట గ్రామంలో ఏర్పాటు చేసిన బస్‌లు, లారీలు, ఆటో లలో బారి బహిరంగ సభకు వెళ్లే వాహనాలను మండల, పట్టణ కార్యదర్శి సోమోజు నాగమణి సీపీఎం పార్టీ జెండా ఊపి ప్రారంభించారు. **వత్సవాయి :** మండలం నుండి పోలంపల్లి, డబ్బాకుపల్లి, వత్సవాయి, చిట్యాల, కన్నివేడు, చిన్న మోదుగుపల్లి, మంగొల్లు, మ క్రపేట, తదితర గ్రామాల నుండి టాటా ఏస్ లో, ఆటోలో తరలి వెళ్లారు సుమారు 400 మందికి పైగా తరలి వెళ్లారు. పార్టీ సీనియర్ నాయకులు హనుమంతరావు, మండల కార్యదర్శి తమ్మినేని రమేష్, తదితరులు తరలి వెళ్లారు.

పశ్చిమ నియోజకవర్గ సమగ్రాభివృద్ధే లక్ష్యం

వృద్ధురాలి సమస్యలను తెలుసుకుంటున్న వెలంపల్లి

ప్రజాశక్తి - వన్‌టౌన్ : పశ్చిమ నియోజకవర్గ సమ గ్రాభివృద్ధే లక్ష్యంగా పని చేస్తున్నట్లు పశ్చిమ శాసన సభ్యులు వెలం పల్లి శ్రీనివాస రావు చెప్పారు. బుధవారం స్థానిక 47వ డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఆయన పర్యటించారు. డివిజన్‌లో జరగాల్సిన అభివద్ధి పనుల గురించి అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా వెలంపల్లి మాట్లాడుతూ డివిజన్‌లోని కొండ ప్రాంతాల్లో మెట్లు, డ్రెయిన్లు అభివద్ధి చేస్తామని అన్నారు. ర్యాంప్‌లు వేస్తున్నామన్నారు. స్టేడియం నిర్మాణానికి కషి చేస్తున్నామన్నారు. గ్రౌండ్ అభివద్ధి చేశామని, యువకులు క్రికెట్ ఆడుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి,స్థానిక కార్పొరేటర్ గోదావరి గంగా, పాల్గొన్నారు.

అభివృద్ధి వివరాల డిస్‌ప్లే ఆవిష్కరణ

ప్రజాశక్తి - నందిగామ : నందిగామ పట్టణంలోని 5,6 వార్డుల పరిధిలోని సచివాలయాల పరిధిలో "వై ఏపీ నీడ్స్ జగన్" కార్యక్రమాన్ని బుధవారం ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్ మోహన్‌రావు ప్రారంభించారు. ఆయా సచివాలయాల పరిధిలో ప్రజలకు అందించిన సంక్షేమం.. చేసిన అభివృద్ధి వివరాల డిస్ ప్లే బోర్డులను శాసనసభ్యులు డాక్టర్ మొండితోక జగన్ మోహన్ రావు ఆవిష్కరించారు. జగనన్న విప్లవాత్మక పరిపాలనను అడ్డుకోవాలని ప్రయత్నిస్తున్న దుష్టశక్తుల ఆట కట్టించాలన్నారు. కార్యక్రమంలో కమిషనర్ జయరాం, యార్డ్ చైర్మన్ మస్తాన్, ఆరో వాటి కౌన్సిలర్ షేక్ యాకూబ్ అలీ, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

నెహ్రూ నగర్‌లో సమస్యలు తెలుసుకుంటున్న కమిషనర్ జయరామ్

14వ వార్డులో మున్సిపల్ కమిషనర్ పర్యటన

ప్రజాశక్తి - నందిగామ : నందిగామ పట్టణ పరిధిలో 14వ వార్డులో బుధవారం మున్సిపల్ కమిషనర్ డాక్టర్ ఎస్.జయరామ్ పర్యటించారు. ప్రజల సమస్యలు తెలుసుకుంటూ వార్డులోని ఖాళీ స్థలాలు అపరిశుభ్రంగా ఉండటంతో సంబంధిత స్థల యజమానులకు నోటీసులు జారీ చేయవలసినదిగా సిబ్బందిని ఆదేశించారు. ఇంటింటికీ చెత్త సేకరణ జరుగుతున్నప్పటికీ ఖాళీ స్థలంలో చెత్త వేయటం పట్ల, స్థానికులు ఎవరు చెత్త బయట పడవేయకుండా కేవలం చెత్త సేకరకు వచ్చు పారిశుద్ధ్య కార్మికులకు మాత్రమే అందించేలా ప్రజలకు అవగాహన కల్పించాలని అన్నారు. ఈ సందర్భంగా వార్డులో దోమల నివారణకు వెక్టార్ కంట్రోల్ మెథడ్స్‌లో భాగంగా మురుగునీరు నిలువ ఉన్న ప్రాంతాలలో ఆయిల్ బాల్స్ వేయడం, డే ఫాగింగ్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వార్డు ఇంచార్జ్ నరేంద్ర, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పేటలో వైసిపి ప్రచారం

జగ్గయ్యపేట: పట్టణంలోని 6వ సచివాలయం 16, 17 వార్డులలో వై ఏపి నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహిం చారు. వైసిపి ఆదేశాను సారం ప్రభుత్వవిప్ సామినేని ఉదయభాను సూచనలు మేరకు మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్రతో కలిసి యువనాయకులు సామినేని వెంకటకృష్ణ ప్రసాద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో చంద్రబాబు హయాంలో ప్రస్తుతం జగన్మోహన్ రెడ్డి పాలనలో ఇచ్చిన హామీలు అమలు చేసిన పథకాల వాస్తవాలను వివరించేందుకే ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు.



కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు

దుర్గగుడి దేవస్థానాన్ని గాజులతో అలంకరించిన ఆలయ అధికారులు

గాజులతో దుర్గమ్మ దేవాలయం అలంకరణ

ప్రజాశక్తి - వన్‌టౌన్ : శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం, ఇంద్ర కీలాద్రిపై శ్రీ అమ్మవారి గాజుల అలంకరణ మహోత్సవం సందర్భంగా బుధవారం దుర్గమ్మను రంగు రంగు గాజులతో అలంకరించారు. అంతేగాక ఆలయ ప్రాంగణాన్ని వివిధ వర్ణముల గాజులతో అమ్మవారి ప్రధానాలయము, ఉపాలయములు, దేవతామూర్తులు మరియు మహామండపం ఆరవ అంతస్తు నందు గాజులతో అలంకరించారు. ఈ సందర్భంగా దుర్గమ్మ దర్శనంకు వచ్చిన వారు గాజుల అలంకర ణలో దర్శన మిస్తున్న దుర్గమ్మను దర్శించి తరిస్తున్నారు.

దుర్గమ్మ సన్నిధిలో హీరోయిన్ హన్సిక

ఇంద్రకీలాద్రిపై గాజుల అలంకరణలోని జగన్మాత కనక దుర్గమ్మను హీరోయిన్ హన్సిక బుధవారం దర్శనం చేసుకున్నారు. హన్సికను ఆలయ మర్యాదలతో అధికారులు స్వాగతం పలికారు. వేద పండితులు వేద మంత్రాలతో ఆశీర్వ దించారు. కనక దుర్గమ్మ చిత్రపటాన్ని, ప్రసాదాన్ని అందజేశారు. మై నేమ్ ఈజ్ శతి మూవీ ప్రమోషన్స్ కోసం విజయవాడకు వచ్చిన హన్సిక మీడియాతో మాట్లాడుతూ నవంబర్17న వరల్డ్ వైడ్‌గా తన చిత్రం విడుదల కానుందని, ప్రేక్షకులు తన చిత్రాన్ని ఆదరించాలని కనకదుర్గమ్మను వేడుకున్నట్టు ఆమె తెలిపారు.

బాలలపై మాదక ద్రవ్యాల ప్రభావం

ప్రజాశక్తి - విజయవాడ : నవజీవన్ బాల భవన్ ఆద్వర్యంలో బాలల హక్కుల వారోత్సవాలలో భాగంగా విజయవాడలోని పాలపర్తి సుందరమ్మ నగరపాలక బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులకు "మాదక ద్రవ్యాల నిర్ములనలో బాలలు, యువత పాత్ర' అనే అంశంపై సందేశాత్మక లఘు చిత్ర నాటక ప్రదర్శన పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా నవజీవన్ బాల భవన్ జోనల్ కోఆర్డినేటర్ ఎం.డి వసంతకుమారి మాట్లాడుతూ మాదక ద్రవ్యాల ప్రభావం బాలలు పై ఎక్కువగా ప్రభావం చూపుతుందని, ముందు జాగ్రత్తతోనే మాదక ద్రవ్యాల అలవాటు, ఆలోచనలను అవగాహన కల్పించి వారిలో చైతన్యం తీసుకురావచ్చని, ఈ రోజు 'మాదక ద్రవ్యాల నిర్ములనలో బాలలు యువత పాత్ర' అనే అంశంపై సందేశాత్మక లఘు చిత్ర నాటక ప్రదర్శన పోటీలను బాలలతో ప్రదర్శన నిర్వ్యాహించామని తెలిపారు. ఇలాంటి కార్యక్రమాల ద్వారా వ్యక్తిగతంగా అవగాహన కలిగివుంటారని, అనంతరం ఈ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులను వారు అభినందించారు. ఈ పోటీల్లో మొదటి, రొండో, మూడో స్థాయిల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో నవజీవన్ బాల భవన్ జోనల్ కోఆర్డినేటర్ విజయరాణి, పాఠశాల ఇంచార్జి ప్రధానిపాద్యాయులు ఏ రమాదేవి, ఉపాధ్యాయులు, రాజ్యలక్ష్మి, సచివాలయ మహిళా సంరక్షణ కార్యదర్శులు విజయ ధనలక్షి, మణిక్యమ్మ, పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

పలు పోటీల్లో బహుమతులు గెలుచుకున్న విద్యార్థులు

క్వాడ్రాంగ్యులర్ వన్డే క్రికెట్ టోర్నీ

- ఇండియా -ఎ, బంగ్లాదేశ్ విజయం

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ : బిసిసిఐ (భారత క్రికెట్‌నియంత్రణ మండలి) ఆధ్వర్యంలో ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ (ఎసిఎ) పర్యవేక్షణలో అండర్ –19 క్వాడ్రాంగ్యులర్ వన్డే క్రికెట్ టోర్నీలో బుధవారం జరిగిన మ్యాచ్‌లో బంగ్లాదేశ్, ఇండియా – ఎ జట్లు విజయం సాధించాయి. మూలపాడులోని ఎసిఎ క్రికెట్ స్టేడియలో తొలి మ్యాచ్ ఇండియా –ఎ, ఇంగ్లాండ్ జట్ల మధ్య జరిగింది. ఈ మ్యాచ్‌లో ఇండియా – ఎ జట్టు 46 పరుగుల ఆధిక్యతతో విజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో ఇంగ్లాండు జట్టు టాస్ గెలిచి ఫీల్డింగ్ ఎంచుకుంది. దీనితో తొలుత బ్యాటింగ్ చేసిన ఇండియా – ఎ జట్టు 50 ఓవర్లలో ఎనిమిది వికెట్ల నష్టానికి 293 పరుగులు చేసింది. జట్టులోని ఓపెనింగ్ బ్యాట్స్‌మెన్ ఉదయ్ శహరాన్ 74 మంతుల్లో ఆరు బౌండరీల సహాయంతో 57 పరుగులు చేశాడు. మరో బ్యాట్స్‌మెన్ దిగ్విజయ్ పాటిల్ 50 బంతుల్లో 51 పరుగులు చేశాడు. ఇంగ్లాండు బౌలర్లు ఫర్హాన్ అహ్మద్ రెండు వికెట్లు తీసుకున్నాడు. అనంతరం 294 పరుగుల విజయలక్ష్యంలో బరిలోకి దిగిన ఇంగ్లాండు జట్టు 48.1 ఓవర్లలో పది వికెట్లు కోల్పోయి 247 పరుగులు చేసి ఓటమి చెందింది. జట్టులోని బ్యాట్స్‌మెన్ జైన్ డెఫ్లీ 68 బంతుల్లో 50 పరుగులు, చేశాడు. ఇండియా – ఎ జట్టు బౌలర్లు అర్షిన్ కుల్‌కర్ణి మూడు వికెట్లు, ముషీర్ ఖాన్ రెండు వికెట్లు తీసుకున్నారు. దీనితో ఇండియా ఎ జట్టుకు రెండు పాయింట్లు లభించాయి.

బంగ్లాదేశ్ జట్టు విజయం....

మూలపాడులోని ఎసిఎ డివిఆర్ గ్రౌండ్‌లో జరిగిన ఇండియా –బి. బంగ్లాదేశ్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో బంగ్లాదేశ్ జట్టు ఏడు వికెట్లు ఆధిక్యతతో విజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో బంగ్లాదేశ్ జట్టు టాస్ గెలిచి ఫీల్డింగ్ ఎంచుకుంది. దీనితో తొలుత బ్యాటింగ్ చేసిన ఇండియా – బి జట్టు 47.3 ఓవర్లలో 243 పరుగులకు ఆలౌటయ్యారు. జట్టులోని రుద్ర మయూర్ పటేల్ 64 పరుగులు, వైభవ్ సూర్యవంశీ 75 పరుగులుచేశారు. బంగ్లాదేశ్ బౌలర్లు ఎండి ఇక్బాల్ హసన్ మూడు వికెట్లు, సిద్ధిఖీ రెండు వికెట్లు, మరుఫ్ మ్రిద రెండు వికెట్లు తీసుకున్నారు. అనంతరం 244 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన బంగ్లాదేశ్ జట్టు 43.5 ఓవర్లలో మూడు వికెట్లు మాత్రమే కోల్పోయి 244 పరుగులు చేసి విజయం సాధించింది. జటుట్లఓని ఎండి రహమాన్ 135 పరుగులు, ఎం.డి.రిజ్వాన్ 85 పరుగులుచేశారు. ఈమ్యాచ్‌లో బంగ్లాదేశ్ విజయం సాధించడంతో జట్టుకు రెండు పాయింట్లు ప్రకటించారు.

స్టేడియంలో పెద్ద స్క్రీన్‌పై క్రికెట్ సెమీ ఫైనల్ వీక్షణ

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ : ఇండియా – న్యూజిలాండ్ వరల్డ్ కప్ సెమి ఫైనల్ మ్యాచ్‌ను నగర వాసులు దగ్గరగా తిలకించేందుకుగానూ ఆంధ్రా క్రికెట్ అసోసియేషణ్ ఆధ్వర్యంలో నగరంలోని ఇందిరాగాంధీ మునిసిపల్ కార్పొరేషన్ స్టేడియంలో ప్రత్యేకంగా స్క్రీన్‌లను ఏర్పాటుచేసింది. దీనితో మద్యాహ్నం 1.30 గంటలకు మ్యాచ్ ప్రారంభం కావడంతో స్టేడియం వద్దకు నగర వాసులు, క్రీడాకారులు, క్రికెట్ ప్రేమికులు, ముఖ్యంగా యువత పెద్ద సంఖ్యలో స్టేడియం గ్యాలరీలో కూర్చుని క్రికెట్‌ను ఆస్వాదించారు ప్రదానంగా ఫైనల్ మ్యాచ్ తొలి ఇన్నింగ్స్ భారత్ కావడంతో అందులోనూ భారత్ భారీ స్కోరు చేయడంతో నగర వాసులు క్రికెట్‌ను ఆస్వాదిస్తూ ఎంజాయ్ చేశారు. ముఖ్యంగా సిక్సర్‌లు, బౌండరీలు కొట్టినప్పుడల్లా ఈలలు, కేకలు వేస్తూ క్రికెట్ మజాను ఆస్వాదించారు.

విజయవాడలో మై నేమీజ్ శృతి సందడి

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : నగరంలో నేడు మై నేమ్ ఇస్ శృతి చిత్ర బందం సందడి చేసింది. మై నేమ్ ఇస్ శతి చిత్రం ఒక లేడీ ఓరియంటెడ్ చిత్రమని, ఈ చిత్రం ఈ నెల17న విడుదల కానున్నట్లు ఆ చిత్ర కథానాయకురాలు ప్రముఖ నటి హన్సిక తెలిపారు. సొసైటీలో ఆడవాళ్లకు జరుగుతున్న కొన్ని అంశాలపై ఈ చిత్రం ఉండబోతుందనీ....అందరూ థియేటర్లలో ఈ చిత్రాన్ని తప్పక చూడాలనీ ఆమె కోరారు. మై నేమ్ ఇస్ శతి చిత్ర ప్రమోషన్‌లో భాగంగా చిత్ర యూనిట్ బందరు రోడ్డులోనీ ఓ ప్రముఖ హోటల్‌లో బుధవారం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హన్సిక మాట్లాడుతూ విజయవాడ నాకు ఎంతో అదష్టాన్ని తెచ్చిపెట్టే నగరమని చెప్పారు. శతి క్యారెక్టర్ చేయడం తనకు మంచి పేరును తీసుకొస్తుందని భావిస్తున్నాననీ అన్నారు. దర్శకుడు శ్రీనివాస్ ఈ చిత్రం కొరకు చాలా కష్టపడ్డారన్నారు. పర్ఫెక్షన్ కోసం తనతో 27 టేకులు చేయించారనీ చెప్పారు. కథ తనకు ఎంతో నచ్చడంతో స్టోరీ వినగానే ఓకే చేశాననీ చెప్పారు. దర్శకుడు శ్రీనివాస్ ఓంకార్ మాట్లాడుతూ.....ఇది తన మొదటి డిబ్యుచిత్రమని అన్నారు. తన నిజ జీవితంలో చూసిన ఒక కథ ఆధారంగానే ఈ చిత్రం రూపొందించాననీ చెప్పారు. తమిళంలో కూడా ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నామనీ చెప్పారు. విలేకరుల సమావేశంలో చిత్ర నిర్మాత రమ్య ప్రభాకర్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న హన్సిక

అంతర్జాతీయ తెలుగు మహాసభలకు గవర్నర్‌కు ఆహ్వానం

ప్రజాశక్తి - వన్‌టౌన్ : రానున్న నూతన సంవత్సరం 2024 జనవరి 5వ తేదీ నుండి మూడు రోజుల పాటు రాజమహేంద్రవరంలో జరగనున్న అంతర్జాతీయ తెలుగు మహా సభలు నిర్వహిస్తున్న సందర్భంగా ప్రారంభోత్సవానికి ఆంధ్రప్రదేశ్ గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు ఆంధ్ర సారస్వత పరిషత్ సంస్థ అధ్యక్షులు డా. గజల్ శ్రీనివాస్ బుధవారం కలిసి ఆహ్వానించారు. ఆంధ్ర సారస్వత పరిషత్ సంస్థ, చైతన్య విద్యా సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో అంధ్రమేవ జయతే! అన్న నినాదంతో తెలుగు భాషా వైభవాన్ని విశ్వవ్యాప్తం చేసే దిశగా 2024 జనవరి 5,6,7 తేదీలలో శ్రీ రాజరాజనరేంద్రుల వారి పట్టాభిషేక మహోత్సవ సహస్రాబ్ది సందర్భంగా సాంస్కతిక రాజధాని రాజమహేంద్రవరం, గైట్ ఇంజనీరింగ్ కళాశాల ప్రాంగణంలో అంతర్జాతీయ తెలుగు మహా సభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా జనవరి 5వ తేదీన జరిగే ప్రారంభోత్సవ సభకు ముఖ్య అతిధిగా పాల్గొనాలని ఆంధ్రప్రదేశ్ గవర్నర్ ఎస్ అబ్దుల్ నజీర్‌ను స్వయంగా రాజ్ భవన్‌లో కలిసి ఆహ్వానించినట్లు పరిషత్ అధ్యక్షులు డా.గజల్ శ్రీనివాస్, చైతన్య విద్యా సంస్థల వ్యవస్థాపకులు శ్రీ చైతన్యరాజులు తెలిపారు. తెలుగు మహా సభలలో నిర్వహించే అనేక అంశాలపై వివరణ ఇవ్వగా గవర్నర్ ఎంతో ఆశక్తిగా విన్నారని. తెలుగు మహా సభలకు ఎంతో సహకరిస్తున్న సేవా తత్పరులు, తెలుగు భాషాభిమాని చైతన్య రాజుని గవర్నర్ ప్రత్యేకంగా అభినందించారని డా.గజల్ శ్రీనివాస్ తెలిపారు.

రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్‌ను ఆహ్వానిస్తున్న గజల్ శ్రీనివాస్

ఆర్థిక సాయం అందజేస్తున్న గన్నె ప్రసాద్ (అన్న)

బాధిత కుటుంబాలకు గన్నె సాయం

ప్రజాశక్తి - రెడ్డిగూడెం : మండలంలోని రుద్రవరం గ్రామానికి చెందిన అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తులకు గన్నే ప్రసాద్ (అన్న) స్థానిక టిడిపి నాయకులతో కలిసి ఆర్థిక సాయాన్ని అందజేశారు. రుద్రవరం గ్రామానికి చెందిన అన్నం ఆంజనేయులు, మోదుగు వరపు రమేష్, కే సుధారాణి , మారాజు చంద్రశేఖర్, ఈడ చెన్నయ్య, కసుకుర్తి అప్పారావు, ఊదుకూరి రమేష్, మోదుగు వరపు మహిమకుమారిలకు రూ.20వేలు చొప్పున రూ.1.60 లక్షలు ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా అన్నా మాట్లాడుతూ ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడంలో టిడిపి ముందుంటుందన్నారు. అనంతరం కోనప రాజు పర్వ గ్రామానికి చెందిన మాజీ ఎంపిపి తోటకూర నారాయణరావును ఆయన నివాసానికి వెళ్లి పరామర్శించారు. ఈ కార్యక్రమంలోమాజీ తెలుగు యువత అధ్యక్షులు పాలంకి సురేష్ రెడ్డి, రుద్రవరం టిడిపి గ్రామ అధ్యక్షులు మాదాల సాంబశివరావు పాల్గొన్నారు.

బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

17, 18 తేదీల్లో గిరిజన సంక్షేమంపై జాతీయ సదస్సు

ప్రజాశక్తి - వన్‌టౌన్ : కాకరపర్తి భావనారాయణ కళాశాల ఆధ్వర్యంలో ఈ నెల 17, 18 తేదీల్లో 'భారతదేశంలోని గిరిజనుల సంరక్షణ, అభివద్ధిని విస్తతం చేసే ప్రస్తుత అవకాశాలు' అంశంపై జాతీయ సదస్సును నిర్వహిస్తున్నట్లు ఆ కళాశాల కార్యదర్శి తూనికుంట్ల శ్రీనివాసు తెలిపారు.. ఈ సందర్భంగా కళాశాల ఆవరణలో జాతీయ సదస్సుకు సంబంధించిన బ్రోచర్‌ను తూనికుంట్ల శ్రీనివాసు బుధవారం ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కళాశాల డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎకనామిక్స్, కామర్స్ అండ్ మేనేజమెంట్ విభాగాల ఆధ్వర్యంలో ఈ జాతీయ సదస్సును నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ సోషల్ సైన్స్ రీసెర్చ్ సౌజన్యంతో ఈ సదస్సును నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. దేశంలో గడిచిన దశాబ్దాల కాలంగా గిరిజనుల సంక్షేమం, అభివద్ధి కోసం పలు కార్యక్రమాలు అమలు చేయబడుతున్నాయన్నారు. వాటిపై చర్చించటంతో పాటు వాటిని మరింత విస్తతం చేయటానికి ఉన్న అవకాశాలు తదితర అంశాలపై ఈ సదస్సులో చర్చించటం జరుగుతుందన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీ. నారాయణరావు మాట్లాడుతూ ప్రారంభోత్సవ సభకు ఆంధ్రప్రదేశ్ కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ఆచార్య శ్రీనివాసన్, ఏపీ ఉన్నత విద్యా రెగ్యులేటరీ అండ్ మోనిటరింగ్ కమిషన్ ఉపాధ్యక్షులు ఆచార్య పి.విజయప్రకాష్, కష్ణా విశ్వవిద్యా లయం రెక్టార్ ఆచార్య సూర్యచంద్రరావు హాజరవుతారని వివరించారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం... ప్రజల పక్షం

పుట్టినరోజు, వివాహ వేడుక, పదవీ విరమణ, జయంతి, వర్ధంతి, శ్రద్ధాంజలి మరియు లీగల్ మొదలగు అన్నిరకాల ప్రకటనలకై...

మీ బంధు మిత్రులకు తక్కువ సమయంలో సమాచారం తెలపాలంటే తక్కువ ఖర్చుతో ప్రకటనలకై మీ సమీపంలోని ప్రజాశక్తి కార్యాలయంలో గానీ లేదా క్రింది నెంబర్‌కు గానీ సంప్రదించగలరు.
సెల్ నెం: 94900 99530, 94900 99218

విజ్ఞప్తి
స్థానిక వార్తలతో పాటు, జాతీయ, అంతర్జాతీయ వార్తలు, విశ్లేషణల సమాహారం... ప్రజాశక్తి. చందా దారులుగా చేరండి.
94900 99218, 9490099530 నెంబర్లను సంప్రదించండి.